RNI : APTEL 2013/54721

https://prajapratibha.com

# ప్రజా ప్రతిభ

ప్రతి అక్షరం ప్రజా పక్షం

తెలుగు దినపత్రిక

సంపుటి: 13 | సంచిక: 281 | prajapratibha.2013@gmail.com | ఎడిటర్ : దానూరి శ్రీనివాస్ | 9441500341 | వెల: రూ.5.00 | పేజీలు: 10

ఆంధ్రప్రదేశ్ | Published from Andhra pradesh & Telangana | శుక్రవారం, జూన్ 19, 2026



## కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

- నేరగాళ్లకు అడ్డాగా మారిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్
- కేంద్రప్రభుత్వం సంచలన ఆరోపణలు
- ఢిల్లీ హైకోర్టుకు నివేదిక సమర్పణ

02 లో

## నీట్ రీ-టెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

- వందతులను నమ్మొద్దని విద్యార్థులకు వినతి
- 21న రీ టెస్టు కోసం ఏర్పాట్లు పూర్తి: ఎన్‌టీఎ




న్యూఢిల్లీ,జూన్18(ప్రజా ప్రతిభ): నీట్-యూజీ రీటెస్టును పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' ఎన్‌టిఎ తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న రీటెస్టు ఉంటుందని.. పరీక్ష వాయిదా పడుతుందన్న వదంతులను, సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని 'ఎక్స్' వేదికగా సందేశం విడుదల చేసింది. ఎన్‌టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్నిమాత్రమే విశ్వసించాలని తెలిపింది. మరోవైపు.. పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో

మిగతా 2లో..

## హర్మూజ్ తెరుచుకున్నా ఇంధన ధరలు తగ్గవు

- ఇప్పట్లో తగ్గించే ఉద్దేశం లేదన్న కేంద్రం





న్యూఢిల్లీ,జూన్18(ప్రజా ప్రతిభ): అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు దిగిరానున్నాయి. అయితే, ముడి చమురు ధరలు తగ్గినా.. భారత్‌లో వెంటనే ఇంధన ధరలను మాత్రం తగ్గించలేమని కేంద్రం తాజాగా స్పష్టం చేసింది. పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ ఇటీవల ఇంధన ధరలు

మిగతా 2లో..

## ఆధార్ కార్డు ఐడెంటిటీకి మాత్రమే పరిమితం చేయాలి

- పౌరసత్వం, నివాస ధృవీకరణ తదితరాలకు వాడరాదు
- పిటిషన్‌పై సుప్రీం విచారణ






న్యూఢిల్లీ,జూన్18(ప్రజా ప్రతిభ): ఆధార్ కార్డు వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది ఆధార్ కార్డులను పౌరసత్వం, నివాసం, అడ్రస్ ధృవీకరణకు ప్రూఫ్‌గా వాడుతున్నారని, ఇది కేవలం ఐడెంటిటీ వెరిఫికేషన్‌కు మాత్రమే పరిమితం చేయాలని దాఖలైన పిటిషన్‌ను విచారణకు చేపట్టిన సుప్రీంకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటను స్పందించాలని సుప్రీంకోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్,

మిగతా 2లో..

# ఆక్వా ఫీడ్ ధరలు తగ్గించాలి

- ఆక్వా ఫీడ్ ధరపై రైతులు-తయారీదారులతో సీఎం చంద్రబాబు సమావేశం
- ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గించేందుకు కంపెనీల అంగీకారం
- ఆక్వా ఫీడ్ ధరల స్థిరీకరణపై కమిటీ ఏర్పాటు
- ఫీడ్ ధర తగ్గింపు, విద్యుత్ రాయితీపై సీఎంకు రైతుల ధన్యవాదాలు
- గత ప్రభుత్వంలో ఆరు సార్లు ఫీడ్ ధర పెంచినా పట్టించుకోలేదన్న రైతులు



అమరావతి,జూన్18(ప్రజా ప్రతిభ): ఆక్వా ఫీడ్ ధర తగ్గించాలని తయారీదారులను సీఎం చంద్రబాబు నాయుడు కోరడంతో వారు సానుకూలంగా స్పందించారు. దీంతో ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నిర్దేశిరచడంతో ఆక్వా ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గించేందుకు తయారీదారులు అంగీకరించారు. దీంతో కేజీ ప్రస్తుతం రూ.112 నుంచి రూ.108కి ఫీడ్ ధరలు తగ్గనున్నాయి. ఆక్వా, టొబాకో, మామిడి రైతుల సమస్యలపై గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులతోపాటు ఫీడ్ తయారీదారులతో ఆయన సమావేశమయ్యారు. ధరల స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీ దారులతో కమిటీ వేయాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. 20 రోజుల్లో ఈ కమిటీ నివేదిక ఇవ్వాలని వారికి స్పష్టం చేశారు. అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు, ఆక్వా రైతులతోపాటు ఫీడ్ తయారీదారులు పాల్గొన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇవ్వడంపై ముఖ్యమంత్రికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వా సాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతోందని ఈ సందర్భంగా రైతులు తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరు సార్లు పెంచారని గుర్తు చేశారు. అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై చొరవ తీసుకోలేదని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దృష్టికి ఆక్వా రైతులు తీసుకెళ్లారు. తాము ఎప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించ లేదని.. ఇటీవల కొందరు రైతుల ముసుగులో రాజకీయం చేశారని సీఎంకు ఆక్వా రైతులు వివరించారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయే నాటికి అది రూ.107.80కి చేరిందని సీఎం చంద్రబాబుకు రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందని రైతులు గుర్తు చేశారు.

ఉత్పత్తి వ్యయం తగ్గించుకుని మరింత లాభాలు పొందేలా చర్యలు చేపట్టాలని రైతులకు సీఎం సూచించారు. లక్షలాది మంది ఆధారపడిన ఆక్వా రంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని ఈ సందర్భంగా రైతులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో పొగాకు, మామిడి, ఆక్వా ధరలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పొగాకు మార్కెట్ పరిస్థితులపై, సంబంధిత రైతుల సమస్యలు, ధరల స్థిరీకరణపై చర్చించారు సీఎం. పొగాకు బోర్డు ప్రతినిధులతో సీఎం చంద్రబాబు కీలక సమావేశం నిర్వహించారు. మామిడి రైతుల సమస్యలు, మార్కెటింగ్ అవకాశాలపై సమీక్షించారు.

మిగతా 2లో..



## పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రితో మంత్రి లోకేష్ భేటీ


- ఏపీ సంక్షేమ పథకాలు, డిజిటల్ గవర్నెన్స్, పెట్టుబడుల సాధనపై చర్చ
- ఆంధ్రప్రదేశ్-పశ్చిమ బెంగాల్ మధ్య సాంస్కృతిక, ఆర్థిక బంధాల బలోపేతానికి ప్రతిపాదనలు

కోల్‌కతా, జూన్18(ప్రజా ప్రతిభ): పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కోల్‌కతాలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంగళగిరి చేనేత శాలువాతో ముఖ్యమంత్రిని లోకేష్ సత్కరించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న

మిగతా 2లో..

## 20న అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

- కేంద్ర సాయంతో కలిపి రూ.12వేలు జమ
- లింగంగుంట్లలో సీఎం చంద్రబాబు ప్రారంభం
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు




అమరావతి, జూన్ 18(ప్రజా ప్రతిభ): అన్నదాత సుఖీభవ మొదటి దశ నిధులను ఈనెల 20వ తేదీన విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. 45.5 లక్షల మంది రైతులకు కేంద్ర సాయంతో కలిపి రూ.12వేలు జమ చేస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుంట్లలో సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవను లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. పొగాకు రైతుల

మిగతా 2లో..

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరిపించాల్సిందే

- అప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుంది
- రాష్ట్ర గవర్నర్‌కు వైయస్సార్‌సీపీ విజ్ఞప్తి
- మేం ప్రశ్నించాకే సెలక్షన్ లిస్ట్ ఇచ్చారు
- జీవోలు మార్చి స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు
- డీఎస్సీ అక్రమాల్ని గవర్నర్‌కి వివరించాం
- రాష్ట్ర దర్యాప్తుతో ప్రయోజనం ఉండదని చెప్పాం
- సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేయించాలి
- గవర్నర్ సానుకూలంగా స్పందించారు
- సాయికృష్ణ లాకప్ డెత్ ప్రభుత్వ హత్యే
- దీనిపైనా సీబీఐ దర్యాప్తు చేయించాల్సిందే
- మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ.



అమరావతి,జూన్18(ప్రజా ప్రతిభ): డీఎస్సీలో కూటమి ప్రభుత్వం అడుగడుగునా అక్రమాలకు పాల్పడిందని, మెగా డీఎస్సీని కాస్తా దగా డీఎస్సీగా మార్చేసిందని, దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, బాధితులకు న్యాయం జరుగుతుందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. పార్టీ ఎమ్మెల్సీలు, నేతలతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి ఆ మేరకు వినతిపత్రం సమర్పించిన అనంతరం మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న దుశ్చర్యలపై గవర్నర్ కు ఫిర్యాదు చేశాం. ముఖ్యంగా మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు ఆశలు కల్పించి పూర్తిగా దగా చేశారని గవర్నర్ గారికి చెప్పాం. విపక్షం కానీ ప్రజలు కానీ ఆధారాలతో సహా ఏదైనా విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పుడు సందేహాల్ని నివృతి చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అలా జరగలేదు.

ముందుగానే ప్రభుత్వం తాము అనుకున్న వ్యక్తులతో లాలూచీ పడి డీఎస్సీ ప్రశ్నాపత్రం సెట్ చేసిన దగ్గరి నుంచి ఉద్యోగాలు ఇచ్చే వరకూ, స్పోర్ట్స్ కోటాతో కలిపి అక్రమాలకు పాల్పడింది. దీనిపై ఐదు అంశాలతో గవర్నర్ గారికి ఫిర్యాదు చేశాం. ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భావం తర్వాత డీఎస్సీ నిర్వహించినప్పుడు ఎంపికైన అభ్యర్థుల జాబితాల్ని కలెక్టర్ కార్యాలయాల్లో పెట్టేవారు. ఆ తర్వాత ఇంటర్వ్యూలకు పిలిచేవారు. కానీ ఇప్పుడు ఆ లిస్ట్ ఎక్కడుంది. సమస్యపై మేం ప్రశ్నించిన తర్వాత అన్నీ సర్దుకుని సెలక్షన్ లిస్ట్ వెబ్ సైట్ లో పెట్టారు.

దీనిపై నేనే స్వయంగా నలుగురు డీఈవోలతో మాట్లాడాను. కానీ వారి దగ్గర లిస్టు దొరకలేదు. మేం ప్రశ్నించడం మొదలుపెట్టాక వెబ్ సైట్లో పెట్టారు. అంటే ఇక్కడ ఏదో జరిగింది. ప్రభుత్వ

మిగతా 2లో..



## లాకప్‌డెత్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- కృష్ణలంక సీఐతో పాటు, విజయవాడ సీపీ రాష్ట్ర డీజీపీకి కూడా ఈ కేసుతో సంబంధం
- వైయస్ జగన్ వెల్లడి

విజయవాడ,జూన్18(ప్రజా ప్రతిభ): కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్‌డెత్‌కు గురైన సాయికృష్ణ కేసులో సీబీఐ దర్యాప్తు జరగాలని, అందుకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కేసులో విజయవాడ కమిషనర్‌తో పాటు, రాష్ట్ర డీజీపీకి కూడా ప్రమేయం ఉందని ఆయన వెల్లడించారు. కేవలం కంటి తుడుపుగా సీఐని సస్పెండ్ చేశారన్న వైయస్ జగన్, విజయవాడ సీపీ, డీజీపీతో సహా, అందరిపై మర్డర్ కేసు పెట్టి శిక్షించాలని తేల్చి చెప్పారు.

విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్‌డెత్‌కు గురైన గాదె సాయికృష్ణ తల్లి, కుటుంబ సభ్యులను మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. కృష్ణలంకలో ఉంటున్న వారి ఇంటికి వెళ్లి మాట్లాడిన వైయస్ జగన్ ఓదార్చారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు.

విజయవాడ నడిబొడ్డున, అంటే రాష్ట్రానికి రాజధాని ప్రాంతం. ఇక్కడి నుంచి కూతవేటు దూరంలోనే ముఖ్యమంత్రి నివాసం. ఇక్కడి నుంచి కూతవేటు దూరంలోనే డీజీపీ కార్యాలయం. విజయవాడలోనే కమిషనరేట్ కూడా ఉంది. ఇక్కడే ఏసీపీపరిధి. ఇదే పరిధిలోనే ఈ పోలీసు స్టేషన్ ఉంది. ఇదే పోలీసు స్టేషన్ పరిధిలోనే నా పక్కనే ఉన్న ఈ తల్లి ఎంత దారుణంగా ఈ ఘటన జరిగిందో చెప్తూ రోదిస్తున్న దృశ్యం. ప్రతీ ఒక్కరినీ ఒకటో ఆలోచన చేయమని అడుగుతున్నా.

చంద్రబాబునాయుడు దగ్గరుండి ప్రోత్సహిస్తున్న కొంతమంది పోలీసులు, వీరు చేసే

మిగతా 2లో..



## వెన్నుపోటు రాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

- కులాల మధ్య తగవులు పెట్టడం ఆయనకే చెల్లింది
- హోంమంత్రి అనితపై గుడివాడ వ్యాఖ్యలు దారుణం
- మాజీమంత్రి సోమిరెడ్డి ఘాటు విమర్శలు

నెల్లూరు,జూన్18(ప్రజా ప్రతిభ): వెన్నుపోటు పేరుతో ర్యాలీలు నిర్వహిస్తున్న జగన్ ముందుగా తన రాజకీయ చరిత్రను చూసుకోవాలని మాజీమంత్రి, టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి అన్నారు. మద్యనిషేధం సహా అన్ని హామీలు విస్మరించిన జగన్‌కు, కూటమి మేనిఫెస్టో గురించి

మిగతా 2లో..

# లాకప్‌డెత్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మొదటిపేజీ తరువాయి..

పనుల వల్ల ఈ రాష్ట్రంలో ఏదైనా అన్యాయం జరిగితే పోలీసు స్టేషన్‌కు పోవడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది. అలా ఈ రాష్ట్రంలో పరిపాలన సాగుతోంది. ఇదే పోలీసు స్టేషన్ కమిషనరేట్, ఏసీపీ కార్యాలయం పరిధిలో ఉన్నాయి. అందరూ కూడబలుక్కుని ఒకరినొకరు ఎలా వెనకేసుకువస్తున్నారని చెప్పడానికి నిదర్శనం ఇది. మే మాసంలో ఒక ఘటన జరిగింది. సాయికృష్ణది ఓ ఘటన అయితే క్రాంతికుమార్ అనే మరో పిల్లాడిది ఇంకో ఘటన. అది ఆత్మహత్య ఘటన. పటమట సీఐ, పటమట పోలీసు స్టేషన్ పరిధి. రోజూ నన్ను కొడుతున్నారు, నేను తట్టుకోలేకపోతున్నాను. నా చావుకు కారణం ఆ సీఐ అని మరణ వాంగ్మూలం ఇస్తూ తాను ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి. మే 9న సాయికృష్ణ ఘటన కూడా జరిగింది.

ఆరోజు (మే 9) నుంచే సాయికృష్ణ తల్లి పోలీసుస్టేషన్ చుట్టూ తిరిగితే, 'నీ కొడుకు ఫొటోకు దండ వేసుకో'.. అంటూ ఆ తల్లిని హేళనగా మాట్లాడిన పరిస్థితి. ఆరోజు నుంచి ఈ తల్లి ప్రతీ రోజూ తనకు సమాచారం అందే కొద్దీ, ఆ స్టేషన్‌లో జరుగుతున్న విషయాల మీద మిగతా వాళ్ల సమాచారం ఇస్తుంటే, తన కుమారుడిని పోలీసులు చిత్రహింసలు పెడుతున్నారని అర్థమై అదే పోలీసు స్టేషన్‌కు ప్రతీ రోజూ వెళ్లి నా కొడుకును నాకు చూపించమని బాధపడుతున్న పరిస్థితులు మన కళ్ల ఎదుటే కనిపిస్తున్నాయి.

జరిగిన ఘటన మీద ఈ తల్లితో పాటు చిన్నమ్మ అయిన లాయర్ డీజీపీ ఆఫీసుకు వెళ్లి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఏమైంది? వివరికి చెత్త బుట్టలోకి వెళ్లింది. డీజీపీ ఫిర్యాదును సీపీకి పంపించడం, సీపీ యాక్షన్ తీసుకోకుండా మిగతా వాళ్లను పిలిపించి బేరం పెట్టించే కార్యక్రమం చేశారు.

అప్పుడు కచ్చితంగా నా కొడుకును ఏదో జరిగిందని ఆ తల్లికి అర్థమై జూన్ 2న హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేసింది. నా కొడుకు కనిపించడం లేదు, వీళ్లు ఏదో చేశారని పిటిషన్ వేసింది. అప్పుడు కోర్టు జోక్యం చేసుకుని మన లాంటి వాళ్లంతా ఆ తల్లికి అండగా నిలబడితే గత్యంతరం లేక ఈ రోజు సీఐని సస్పెండ్ చేశారు. ఆ సీఐని ఎందుకు సస్పెండ్ చేశారో చెప్పగలరా?

చనిపోతానికి కదా సీఐని సస్పెండ్ చేసింది. అందులో ఒకే పోలీసు స్టేషన్లోనే ఆ సీఐ పరిధిలోనే, ఆ సీఐని కాపాడుతూ ఏసీపీ, ఏసీపీని కాపాడుతూ కమిషనర్, కమిషనర్ ను కాపాడుతూ డీజీపీ.. మొత్తం అందరికీ తెలిసి స్టేషన్లో జరిగిన ఒక హత్య మాత్రమే కాదు.

ఆ పోలీసుల మీద ఎందుకు మీరు యాక్షన్ తీసుకోవడం లేదు జరిగింది, సస్పెన్షన్ మాత్రమే చేసి టెంపరరీగా ఉద్యోగం నుంచి పక్కన పెట్టారంటే ఇది ఒక్కరితో కాదు, సిస్టమేటిక్‌గా జరుగుతున్న ఈ క్రైమ్ లో సీఐ ఒక్కడే కాదు ఏసీపీ, సీపీ, డీజీపీ ఇన్వాల్వ్ అయి ఉన్నారు. అందుకే సీబీఐ ఎంక్వైరీకి డిమాండ్ చేస్తున్నాం. డిమాండ్ చేయడమే కాకుండా న్యాయపోరాటంలో ఈ తల్లికి, చనిపోయిన మరో పిల్లాడి కుటుంబానికి వైఎస్సార్సీపీ సంపూర్ణంగా అండగా ఉంటుందని తెలియజేస్తున్నాం.

ఇదంతా ఎంత కంటితుడుపు చర్య అంటే, అసలు యాక్షనే తీసుకోలేదు. మే 9వ తారీఖు నుంచి రెండు మర్డర్ ఘటనలు జరిగితే ఇప్పుడు జూన్ లో బయటికి వచ్చిన తర్వాత కంటి తుడుపు చర్యగా అరెస్టులు కూడా చేయకుండా సస్పెన్షన్లు చేస్తున్నారంటే, ఏ విధంగా వీళ్లంతా క్రైమ్ ను బయటికి రాకుండా చేస్తున్నారో, ఈ తల్లి దగ్గరకు పంచాయతీలు చేసి, సర్దుబాటు చేసుకునేందుకు బేరసారాలు చేస్తూ, ఇక్కడ తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన ఇన్‌ఛార్జ్‌లు వచ్చి మాట్లాడుతున్నారంటే రాష్ట్రంలో ఎలాంటి దారుణమైన పరిస్థితులు ఉన్నాయో గమనించాలి. దీని మీద ఎంక్వైరీ అట. కమిషనర్ అనే వ్యక్తి, డీజీపీ అనే వ్యక్తి ఇటువంటి వ్యక్తులు పూర్తిగా ఇన్వాల్వ్ అయి ఈ క్రైమ్ చేయించారని కనిపిస్తూ ఉన్న పరిస్థితుల్లో ఓ ఎస్పీ స్థాయి అధికారిని వీళ్లు ఎంక్వైరీ చేయడానికి బాధ్యత అప్పగించారంట. అంటే ఏ రకంగా వీళ్లు లా అండ్ ఆర్డర్ తో చెలగాటం ఆడుతున్నారు, ప్రజల ప్రాణాలతో ఏ విధంగా చెలగాటం ఆడుతున్నారు దానికి ఇది ఇంకొక నిదర్శనం.

నేను ఒకటే చెప్తున్నాను. ఇది కచ్చితంగా సీబీఐ ఎంక్వైరీకి పోవాలి. బాధ్యులు ఎవరెవరైతే ఉన్నారో సీఐ దగ్గర నుంచి ఏసీపీ దగ్గర నుంచి, కమిషనర్, డీజీపీ, హోంమంత్రి వరకూ అందరూ నిర్లక్ష్యం వైఖరితో ఉన్నారు కాబట్టి సీబీఐ దర్యాప్తు జరగాల్సిందే. దోషులు ఎవరో తెలిసి ఎలా కాపాడుతున్నారు? ఎందుకు రోటీన్ పద్ధతిలో ఇలాంటి లాకప్ డెత్ లు జరుగుతున్నాయో తెలియాలంటే సీబీఐ రావాల్సిందే అని డిమాండ్ చేస్తున్నాం.

## 20న అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

మొదటిపేజీ తరువాయి..

సమస్యలపై మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి, డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డిలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. ఆక్వా, పొగాకు, మామిడి రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. పొగాకు ధర రూ.200 తగ్గకుండా కొనుగోళ్లు జరగాలని సీఎం ఆదేశించారని పేర్కొన్నారు. తోతాపురి మామిడికి కేజీకి రూ.4 ప్రభుత్వం చెల్లించాలని నిర్ణయించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 28శాతంపైలు పొగాకు బోర్డు వేలంలో పాల్గొనాలని సీఎం ఆదేశించారని అన్నారు. ఇకపై ఆక్వా ఫీడ్ ధరలు పెరగాలంటే కమిటీ ద్వారానే నిర్ణయం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతులు, ఫీడ్ ఉత్పత్తిదారులు, ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పడే కమిటీ ధరలు సమీక్షించి నిర్ణయిస్తుందని వివరించారు. పొగాకు రైతులు గత ఏడాది కంటే ఎక్కువ వర్జీనియా రకం సాగు చేయటంతో ధరలపై ప్రభావం చూపిందని అన్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కూడా పొగాకు ధరలు పడిపోయాయని చెప్పుకొచ్చారు. సీఎం చొరవతో 28రకాల పొగాకు కంపెనీలతో చర్చించామని తెలిపారు. పొగాకు బోర్డు వేలంలో కాకుండా దొంగచాటుగా కొనుగోళ్లు జరిపితే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఢిల్లీ కూడా వెళ్లి పొగాకు రైతులు నష్టపోకుండా కేంద్రమంత్రులను కూడా కలుస్తామని వెల్లడించారు. తోతాపురి మామిడి రైతులకు గత ఏడాదిలాగే టన్నుకు రూ.4వేలు చెల్లిస్తామని అన్నారు. ఆక్వా రైతులపై ఉద్యమ కార్యాచరణ అనటానికి వైసీపీ నేతలకు సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. సాయికృష్ణ హత్యను రాజకీయం చేయటం గొడ్డలి పార్టీకే చెల్లిందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని జగన్ కుల, మతాల మధ్య తగాదాలు పెట్టాలని చూస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు బోర్డు వేలంలో అన్ని కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. వచ్చే ఏడాది ఎంతమేర పంట వేయాలనేది ముందుగానే చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వ్యాపారస్తులు ఎట్టిపరిస్థితుల్లోనూ రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులు నష్టపోయే చర్యలను చేపడితే ఉపేక్షించబోమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు.

## ఆక్వా ఫీడ్ ధరలు తగ్గించాలి

మొదటిపేజీ తరువాయి..

మామిడి దిగుబడులు, ధరల పరిస్థితులపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఉన్నతాధికారులు ఓ నివేదిక అందజేశారు. అదే విధంగా ఆక్వా రంగంలో ధరల హెచ్చుతగ్గులపైనా చర్చించారు సీఎం. రొయ్యలు, చేపల రైతుల సమస్యలపై ఈ సమీక్ష సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రొయ్యల ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులతోనూ ఆయన భేటీ అయ్యారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, హేచరీల ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. వ్యవసాయం, ఉద్యానవన, మత్స్యశాఖల ఉన్నతాధికారులతో ఈ సమస్యలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

## ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల


**అమరావతి,జూన్18(ప్రజా ప్రతిభ):** ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా తెలుసుకోవచ్చు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్, అవసరమైన వివరాలు నమోదు చేసి ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాల్లో 59 శాతం మంది, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 53 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మెరుగైన ఫలితాలు పొందిన విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు.

# కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

**నేరగాళ్లకు అడ్డాగా మారిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్**

**కేంద్రప్రభుత్వం సంచలన ఆరోపణలు**

**ఢిల్లీ హైకోర్టుకు నివేదిక సమర్పణ**



**న్యూఢిల్లీ,జూన్18(ప్రజా ప్రతిభ):** మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది. సైబర్ నేరగాళ్లు, అతి వాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు దిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది.

నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.

ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్‌లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేక పోతున్నారని కేంద్రం తమ అఫిడవిట్‌లో ఆరోపించింది. ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది. పిల్లలపై లైంగిక దాడుల వంటి దృశ్యాలను ఈ యాప్ గ్రూప్‌ల్లో విపరీతంగా షేర్ చేస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ వేదికపై నకిలీ ఖాతాలను సృష్టించి.. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మెసేజింగ్ ఎలాట్‌ఫామ్ దుర్వినియోగంపై ఇటీవలి కాలంలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది. హ్యాకర్ గ్రూప్‌లు కూడా ఈ టెలిగ్రామ్ ఛానళ్లను ఉపయోగించి పెద్ద ఎత్తున డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు కేంద్రం తన అఫిడవిట్‌లో వెల్లడించింది. అంతేగాక, యూజర్ల వ్యక్తిగత డేటా అయిన మొబైల్ నంబర్లు, ఆధార్ వివరాలు, ఇతర సున్నితర సమాచారాన్ని యాక్సెస్ చేసేలా టెలిగ్రామ్ బాట్స్ పనిచేస్తుండటంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మాధ్యమంలో పైరసీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, కాపీరైట్ కంటెంట్ కూడా ప్రసారమవుతున్న విషయాన్ని కేంద్రం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.

# ఆధార్ కార్డు ఐడెంటిటీకి మాత్రమే పరిమితం చేయాలి

మొదటిపేజీ తరువాయి..

జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం, న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్ ను విచారించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఆధార్‌ను ఐడెంటిటీ ప్రూఫ్ గా మాత్రమే వాడాలని పౌరసత్వం, నివాసం, అడ్రస్, పుట్టిన తేదీకి సంబంధించిన రుజువుగా వినియోగించకుండా కేంద్ర, రాష్ట్ర, ఎన్నికల సంఘాలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు పిటిషనర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్. ఓటరు నమోదుకు బర్త్ డేట్, రెసిడెంట్ ప్రూఫ్‌లకు ఆధార్ కార్డును వినియోగిస్తున్నారని, ఇది ఆధార చట్టానికి విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 'ఆధార్ పౌరసత్వానికి లేదా రెసిడెంట్‌కు ప్రూఫ్ కాదని స్పష్టంగా తెలిపింది ఉడాయ్. అయినప్పటికీ, ఆధార్‌ను స్కూల్ అడ్మిషన్లు,ప్రాపర్టీ కొనుగోలు, బర్త్ ప్రూఫ్ రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కోసం వయస్సు, పౌరసత్వం, నివాస ధృవీకరణ పత్రంగా ఉపయోగించడమే కాకుండా, కొత్త ఓటరు నమోదుకు, పుట్టిన తేదీకి, నివాస ధృవీకరణ పత్రంగా కూడా వాడుతున్నారు. ఈ విధంగా, చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్‌ను ఉపయోగించి వివిధ డాక్యుమెంట్లను పొందుతున్నారని పిటిషన్‌లో కోర్టుకు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలలో ధృవీకరణ వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేయాలని, సంస్కరణలను పర్యవేక్షించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు.

# హర్మూజ్ తెరుచుకున్నా ఇంధన ధరలు తగ్గవు

మొదటిపేజీ తరువాయి..

పెంచడంపై గురువారం మాట్లాడారు. లీటరుకు దాదాపు రూ.3.94 మాత్రమే పెంచామన్నారు. అయితే, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన.. ఆ పెంపును వెంటనే తగ్గించలేమన్నారు. హర్మూజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ.. ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో తక్కువ ధరకు లభించే ముడి చమురు భారత్‌కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు. ఇలా పలు అంశాల వల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని స్పష్టంచేశారు. ఇక, పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశంలోని చమురు కంపెనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయన్నారు. ఆ సమయంలో ఇంధన ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించేందుకు ఏ రాష్ట్రం ముందుకు రాలేదన్నారు. దీంతో ఆ భారమంతా కేంద్రంపై పడిందన్నారు. దీని కారణంగా కేంద్రం రూ.12వేల కోట్ల మేర ఆదాయం కోల్పోయిందన్నారు.

# నీట్ రీ-టెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి..

ఉంచుకునే మే 3నాటి పరీక్షను రద్దు చేశాం. ఈ వ్యవహారం నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా ప్రక్రియను మరింత బలోపేతం చేశాం. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పటిష్ఠమైన, బహుళ అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం.

ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పరీక్ష సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు 'మానస్' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్‌ను (14416) సంప్రదించి సాయం కోరవచ్చని ఎన్‌టీఏ సూచించింది.పరీక్షకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమ య్యారు. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టండి. ప్రశాంతంగా ఉండండి. బాగా విశ్రాంతి తీసుకోండి. మీ నుంచి ఇదే కోరుకుంటున్నాం అని అభ్యర్థులను ఉద్దేశించి ఎన్‌టీఏ పేర్కొంది. తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా.. విద్యా ర్థులను ప్రశాంతంగా ఉంచాలని, ధ్రువీకరించని సమాచారాన్ని వారితో షేర్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. వారు స్థిరమైన మనసుతో, నిశ్చింతగా పరీక్షకు వెళ్లేలా చూడాలని సూచించింది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3నాటి నీట్-యూజీ పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

# ప్రైవేట్ స్కూల్ ఫీజులను డిస్‌ప్లే చేయాలి


**పబ్లిక్ డొమైన్‌లో తప్పనిసరి ప్రదర్శించాలి**

**అనాథ పిల్లలకు కూడా తల్లికి వందనం అమలు**

**విద్యాశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి లోకేశ్**

**అమరావతి,జూన్18(ప్రజా ప్రతిభ):** ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసర నిబంధనలు తొలగించాలని విద్యా,ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను బోర్డులపై, పబ్లిక్ డొమైన్‌లో తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం ప్రయోజనాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. గార్డియన్లు లేని పిల్లలకు జిల్లా కలెక్టర్ ద్వారా నిధుల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేసే విధానంపై ఆలోచన చేయాలన్నారు. ఇకపోతూ పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే నంబర్-1గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పీఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. గురువారం విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. మెగా పీటీఎం నాటికి విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. 430 కేజీబీవీల్లో 1.06 లక్షల మంది బాలికలకు బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని లోకేశ్ ఆదేశించారు.

ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2.03 లక్షల మంది విద్యార్థులకు కిట్ల పంపిణీ చేయాలన్నారు. తెలుగు అకాడమీ పుస్తకాలు త్వరలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయని లోకేశ్ వెల్లడించారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయాలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి, పోలవరం ప్రాంతాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల హాజరు 95 శాతానికి



తగ్గకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో, పారదర్శకంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మ్యాథ్స్, సైన్స్, తెలుగులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. మాతృభాష తెలుగును విస్మరించొద్దని ఉపాధ్యాయులకు మంత్రి సూచనలు చేశారు. బ్రిడ్జ్ కోర్సు మెటీరియల్ సిద్ధం చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. హైస్కూల్ విద్యార్థులకు క్రోమ్ బుక్స్‌తో కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరిపించాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

పెద్దలు ఇందులో జోక్యం చేసుకున్నారు. అక్రమాలపై ఫోన్ కాల్స్ బయటికి వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం అయినా విచారణ జరిపి కేసులు పెడుతుంది. కానీ ఇక్కడ ఏ చర్యలూ తీసుకోలేదు. నేను, ఆదిమూలపు సురేశ్ కూడా విద్యాశాఖ మంత్రులుగా పనిచేసాం. పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగితే వెంటనే బాధ్యుల్ని అరెస్టు చేసి జైళ్లకు పంపాం. కానీ ఇక్కడ మాత్రం అక్రమాలను ఏమాత్రం పట్టించుకోలేదు.

గత ప్రభుత్వంలో స్పోర్ట్స్ కోటా జీవోలు ఉంటే వాటిని మార్చి జీవోలు ఇచ్చారు. డీఎస్సీ పరీక్ష పూర్తయ్యాక మళ్లీ అవే జీవోల్ని మార్చేశారు. స్పోర్ట్స్ కోటాలో బ్రిడ్జ్ ఆట కూడా గేమ్ అని ఉద్యోగాలు ఇచ్చేశారు. కానీ ఇప్పుడు నిస్సిగ్గుగా పాత ప్రభుత్వం ఇచ్చిందని చెప్తున్నారు. మా ప్రభుత్వంలో ఇస్తే జీవో చూపించమని కోరుతున్నాం.

పరీక్ష రాసి ఉద్యోగం రాకపోతే తమ కన్నా మెరుగైన ప్రతిభ ఉన్న వారికి వచ్చాయని అభ్యర్థులకు ఓ సంతృప్తి ఉంటుంది. కానీ అక్రమాలు జరిగి తమకు రావాల్సిన ఉద్యోగాలు ఎవరికో వెళ్లిపోతే అసలు ఉద్యోగాలు తెచ్చుకున్న వారికి ఎలా ఉంటుంది. ఇది తండ్రీ కొడుకులకు ధర్మమా? ఇవే అంశాలు గవర్నర్ గారికి చెప్పాం. రాష్ట్ర ప్రభుత్వంతో విచారణ జరిపిస్తే ఉపయోగం ఉండదు. కాబట్టి థర్డ్ పార్టీ ఎంక్వైరీ జరగాలని అడిగాం. హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ దర్యాప్తు జరగాలని కోరాం.

ప్రభుత్వ వివరణ తీసుకుంటామని గవర్నర్ చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుతో, వారి మనోభావాలతో ఆడుకోవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. కాబట్టి డీఎస్సీ మీద సీబీఐ దర్యాప్తు జరగాల్సిందే. డీఎస్సీ జరిగిన తీరు మీద మాకు ఏమాత్రం నమ్మకం లేదు. అధికారులు ఒక్కోసారి వచ్చి ఒక్కో వివరణ ఇస్తున్నారు.

అధికారులు కోరుకుంటే వారిని కలిసి మా అభ్యంతరాలు చెప్పేందుకు సిద్దంగా ఉన్నాం. అలా కాకుండా ప్రభుత్వం చెప్పింది కాబట్టి చేస్తున్నాం అంటే మాత్రం ఏమీ చేయలేం. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరిగే వరకూ వైఎస్సార్సీపీ పోరాడుతూనే ఉంటుంది.

లోకేష్‌వి పిల్ల చేష్టలు. ఓ మంత్రి పదవిలో ఉండి, రోడ్డు మీద కనిపించి మీ ఇంటికి వస్తానని సవాళ్లు విసరడం ఏంటి ? నేను కూడా రేపు చంద్రబాబు ఇంటికి వస్తానంటాను. గతంలో మా పార్టీ నాయకుడు జోగి రమేశ్ చంద్రబాబు ఇంటికి వెళ్తే ఆయన్ను ఎందుకు అరెస్టు చేశారో చెప్పండి. లోకేష్ ఇక్కడికి వస్తానంటే సమాధానం చెప్పేందుకు సిద్ధం, గవర్నర్ ని కూడా పిలుస్తాం. కాబట్టి లోకేష్ కుర్ర చేష్టలు, అవగాహన లేని మాటలు కట్టిబెట్టాలి. డీఎస్సీ అక్రమాలు మా దృష్టికి రాగానే మేం సీబీఐ దర్యాప్తు కోరుతున్నాం. లోకేష్ కు మాత్రం ఇప్పుడు గుర్తుకొచ్చినట్లుంది. పరీక్ష పారదర్శకంగా నిర్వహించి ఉంటే సీబీఐ దర్యాప్తుకు భయమెందుకు? ఉమ్మడి రాష్ట్రంలో పరిశ్రమల మంత్రిగా ఉండగా నాపై కూడా 14.70 కోట్లు తినేశామని జర్మనీకి చెందిన ఫోక్స్ వ్యాగన్ కంపెనీ ప్రతినిధులకు ఇచ్చేశామని పత్రికల్లో పుంఖాను పుంఖాలుగా రాశారు. సీఎంగా ఉన్న రాజశేఖర్ రెడ్డి దగ్గరికి వెళ్లి సీబీఐ దర్యాప్తు చేయించమని అడిగాం. ఇప్పుడు కూడా మేం తప్పు చేయలేదని తెలుసు కాబట్టే సీబీఐ దర్యాప్తు చేయించాలని అడుగుతున్నాం.

విజయవాడలో సాయికృష్ణ లాకప్ డెత్ ప్రభుత్వ హత్యే. ఎవరైనా అనుమానాస్పదంగా చనిపోతే సెక్షన్ 302 లేదా 307 పెడతారు. అప్పుడు దానిపై చర్యలు తీసుకుంటారు. కానీ ఇక్కడ ఎలాంటి చర్యల్లేవు. ప్రభుత్వం పోలీసులతో కుమ్మక్కై ఈ హత్యకు పాల్పడింది. కాబట్టి హంతకుల్ని వెంటనే అరెస్టు చేయాలి. మేము అధికారంలో ఉండగా నంద్యాలలో ఓ ఆటోడ్రైవర్ ఏదో చేశాడని భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుడు బాధ్యులైన అధికారుల్ని సస్పెన్షన్‌తో వదిలిపెట్టలేదు అరెస్టు చేశాం. ఈ హత్యకు కారకులందరూ బయటికి రావాలంటే సీబీఐ దర్యాప్తు జరగాల్సిందే. ముందు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలి. ఆ తర్వాత సీబీఐ దర్యాప్తు జరిపించండి. అప్పుడే ప్రజలకు వ్యవస్థ మీద నమ్మకం ఏర్పడుతుందని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు.

# పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రితో మంత్రి లోకేష్ భేటీ

మొదటిపేజీ తరువాయి..

'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని మంత్రి లోకేష్ వివరించారు. దేశంలోనే అత్యధిక ప్రయోజనాలతో కూడిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా అందిస్తున్న ప్రభుత్వ విధానాలను వివరించారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రిని అడిగి తెలుసుకున్నారు.

ఏపీలో అమలవుతున్న డిజిటల్ గవర్నెన్స్, రియల్-టైమ్ మానిటరింగ్ వ్యవస్థల ద్వారా సాధించిన ఫలితాలను లోకేష్ వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేయాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు. పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆలయ నిర్మాణం కోసం తగిన స్థలాన్ని కేటాయించాలని కోరారు. అదే విధంగా తిరుమలలో పశ్చిమ బెంగాల్ భవన్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

మత్స్య సంపద అభివృద్ధి, ఎగుమతుల పెంపు వంటి రంగాల్లో పరస్పర సహకారంతో రెండు రాష్ట్రాలు మరింత పురోగతి సాధించవచ్చని లోకేష్ అభిప్రాయపడ్డారు. మంత్రి ప్రతిపాదనలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# వెన్నుపోటు రాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

మొదటిపేజీ తరువాయి..

మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు పారనివ్వకపోవడంతో కులాల మధ్య తగవులు పెట్టేందుకు సిద్ధమయ్యాడని ఆరోపించారు. జగన్‌కు దమ్మూధైర్యం ఉంటే డీఎస్సీలో అక్రమాలపై ఆధారాలతో చర్చకు రావాలని లోకేశ్ చేసిన సవాల్ స్వీకరించాలన్నారు. రొయ్యల ఫీడ్ కంపెనీలకు జగన్ కులం ఆపాదించడం సిగ్గుచేటన్నారు. అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. తమ ఇంట్లోనూ మహిళలు ఉన్నారనే విజ్ఞత మరిచి గొడ్డలి పార్టీ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. అమర్నాథ్ వ్యాఖ్యలపై జగన్ రాష్ట్ర మహిళలకు, హోంమంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆస్తి కోసం తల్లి, చెల్లిని కూడా వెన్నుపోటు పొడిచిన ఘనుడు జగన్ అని విమర్శించారు. రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారని, ఏదైనా సంఘటన జరిగితే.. దానికి కులం రంగు పులిమి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులాల మధ్య చిచ్చు పెట్టడమనేది జగన్ డీఎన్ఏలోనే ఉందని విమర్శించారు. కుల చిచ్చులో భాగంగానే గుడివాడ అమర్నాథ్ హోం మంత్రి అనితపై దిగజారుడు వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. అనితకు గుడివాడ అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత మహిళ అనిత హోంమంత్రిగా ఎదగడాన్ని సహించడం లేదన్నారు. మహిళల పట్ల జగన్‌కు, గొడ్డలి పార్టీ నేతలకు ఉన్న గౌరవం ఏపాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందని పేర్కొన్నారు. హోం మంత్రి అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణ మన్నారు. మహిళా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి కానీ వ్యక్తిత్వ హననానికి దిగడం వైసీపీ సంస్కృతికి నిదర్శమని అన్నారు. ప్రజాసమస్యలపై మాట్లాడలేని వారు వ్యక్తిగత దూషణలతో రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

# మధ్యాహ్నం చేసే ఈ 6 తప్పులు..
# బరువు పెరగడానికి ప్రధాన కారణం

- మధ్యాహ్నం భోజనం మానేయొద్దంటున్న నిపుణులు
- చిప్స్, బిస్కెట్ల వంటి ప్రాసెస్డ్ స్నాక్స్ తినొద్దు
- తిన్న తర్వాత గంటల తరబడి కూర్చోవద్దు
- మరో పనిచేస్తూ తింటే ఎక్కువ తినే ప్రమాదం
- కాఫీ, కూల్ డ్రింక్స్ తాగొద్దు




(ప్రజా ప్రతిభ - ఆరోగ్య విభాగం)

బరువు తగ్గడం అంటే కేవలం ఉదయాన్నే వ్యాయామం చేయడం, రాత్రి తక్కువ తినడం మాత్రమే కాదు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పాటించే అలవాట్లు కూడా శరీర బరువుపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సమయంలో చేసే కొన్ని సాధారణ పొరపాట్లు మెటాబాలిజాన్ని మందగింపజేసి, ఆకలిని పెంచి, కొవ్వు నిల్వలను అధికం చేస్తాయని చెబుతున్నారు.

**మరి బరువు తగ్గే ప్రయత్నాలను నీరుగార్చే ఆ ఆరు ప్రధాన తప్పులు ఏమిటో తెలుసుకుందాం...**

1. మధ్యాహ్న భోజనం మానేయడం
- క్యాలరీలు తగ్గుతాయనుకోవడం పెద్ద అపోహే!

చాలామంది బరువు తగ్గాలనే ఉద్దేశంతో లంచ్‌ను పూర్తిగా స్కిప్ చేస్తుంటారు. కానీ దీనివల్ల సాయంత్రానికి తీవ్రమైన ఆకలి వేయడంతో రాత్రి సమయంలో అధికంగా తినే అవకాశం ఉంటుంది.

**ఫలితం: బరువు తగ్గడం బదులు మరింత పెరిగే ప్రమాదం.**

2. అన్‌హెల్దీ స్నాక్స్‌కు అలవాటు
- చిప్స్, బిస్కెట్లు... ఆకలిని కాదు, బరువునే పెంచుతాయి

మధ్యాహ్నం తర్వాత వచ్చే అలసటను పోగొట్టుకోవడానికి చాలామంది జంక్ ఫుడ్‌ను ఆశ్రయిస్తారు.

**ఫలితం: అధిక క్యాలరీలు, చెడు కొవ్వులు శరీరంలో పేరుకుని ఊబకాయానికి దారి తీస్తాయి.**

3. తింటూ మొబైల్, టీవీ చూడడం
- 'మైండ్‌ఫుల్ ఈటింగ్' లేకపోతే ముప్పే

టీవీ చూస్తూ, మొబైల్ స్క్రోల్ చేస్తూ లేదా ల్యాప్‌టాప్ ముందు కూర్చొని భోజనం చేయడం వల్ల ఎంత తింటున్నామో మన మెదడు గుర్తించదు.

**ఫలితం: అవసరానికి మించి తినడం.**

4. కదలికలు లేకపోవడం
- భోజనం తర్వాత పూర్తిగా కుర్చీకే పరిమితం అవుతున్నారా?

మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత గంటల తరబడి ఒకే చోట కూర్చోవడం వల్ల శరీర జీవక్రియ మందగిస్తుంది.

**ఫలితం: తిన్న ఆహారం శక్తిగా మారకుండా కొవ్వుగా నిల్వ అవుతుంది.**

5. చక్కెరలు ఎక్కువగా ఉన్న పానీయాలు
- టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్... బరువుకు సైలెంట్ విలన్స్

నిద్రమత్తును వదిలించుకోవాలనే ఉద్దేశంతో అధికంగా టీలు, కాఫీలు, ఎనర్జీ డ్రింక్స్ తాగడం కూడా ప్రమాదకరం.

**ఫలితం: అదనపు క్యాలరీలు చేరి ఊబకాయానికి కారణమవుతాయి.**

6. తిన్న వెంటనే గంటల తరబడి కూర్చోవడం
- పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడానికి ఇదే ప్రధాన కారణం

భోజనం చేసిన వెంటనే విశ్రాంతి తీసుకోవడం లేదా కుర్చీలోనే ఉండిపోవడం శరీరంలోని కొవ్వు కరిగే ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది.

**ఫలితం: బెల్లీ ఫ్యాట్ వేగంగా పెరుగుతుంది.**

నిపుణుల సూచనలు... బరువు తగ్గాలంటే ఇలా చేయండి
- సమయానికి పౌష్టికాహారం తీసుకోండి
- చిప్స్‌కు బదులుగా పండ్లు, డ్రై ఫ్రూట్స్ తినండి
- భోజనం తర్వాత కనీసం 10-15 నిమిషాలు నడవండి
- కూల్‌డ్రింక్స్‌కు బదులుగా మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగండి
- భోజనం చేసే సమయంలో మొబైల్, టీవీలకు దూరంగా ఉండండి
- ఆఫీసుల్లో లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఉపయోగించండి

ఆరోగ్యమే మహాభాగ్యం

బరువు పెరగడానికి పెద్ద కారణాలు ఎప్పుడూ పెద్దవే కావాల్సిన అవసరం లేదు. రోజూ మధ్యాహ్నం సమయంలో చేసే చిన్న చిన్న పొరపాట్లే క్రమంగా ఊబకాయానికి దారి తీస్తాయి. కాబట్టి ఈ అలవాట్లను ఇప్పుడే మార్చుకుంటే ఆరోగ్యకరమైన జీవనశైలి మీ సొంతమవుతుంది.

చిన్న మార్పులు... పెద్ద ఫలితాలు...

# అకస్మాత్తుగా పరవాడ సీఐ ట్రాన్స్‌ఫర్




## ఇటీవలే భారీగా గంజాయి పట్టివేత
## ఆ వెంటనే సీఐ మల్లికార్జున వీఆర్‌కు బదిలీ
## బదిలీపై ఆంతర్యం ఏంటనేది చర్చనీయాంశం
## గతంలో పలు ఆరోపణలు వచ్చినా బదిలీకి ససేమిరా
## ఇప్పుడు ట్రాన్స్‌ఫర్ కావడంపై స్థానికుల విస్మయం



**విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో (క్విక్ టుడే న్యూస్):**

అనకాపల్లి జిల్లా పరవాడ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) మల్లికార్జునను అకస్మాత్తుగా వీఆర్ కు పంపించడం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇంత త్వరగా బదిలీ చేయడానికి గల కారణాలేమిటన్న ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. స్థానికుల వాదన ప్రకారం, సీఐ మల్లికార్జునపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయని, పలువురు బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని అంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దోషులపై కేసులు నమోదు చేశారనే ఆరోపణలు కూడా గతంలో వెలుగులోకి వచ్చాయని పేర్కొంటున్నారు. అయితే, ఇటీవల జరిగిన భారీ గంజాయి పట్టివేత ఘటన అనంతరం ఆయనను వీఆర్‌కు పంపించడం వెనుక ఏదైనా ప్రత్యేక కారణం ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### భారీ గంజాయి పట్టివేత ఘటన

సమాచారం ప్రకారం, జూన్ 16, 2026న పరవాడ పరిధిలో అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 213.360 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీని అంచనా విలువ సుమారు రూ.1.06 కోట్లకు పైగా ఉంటుందని సమాచారం. అయితే ఈ కేసు వివరాలను వెంటనే జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు ఎందుకు తెలియజేయలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనంతరం సమాచారం అందుకున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ జూన్ 17న జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించినట్లు సమాచారం. ప్రజల ప్రశ్నలు ఈ పరిణామాల నేపథ్యంలో ప్రజలు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. గంజాయి పట్టివేత సమాచారం జిల్లా ఎస్పీకి వెంటనే ఎందుకు తెలియజేయలేదు? కేసు నిర్వహణలో ఏవైనా విధానపరమైన లోపాలు జరిగాయా? రాజకీయ లేదా ఇతర ప్రభావాలు ఏమైనా పనిచేశాయా? సీఐ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకున్నారా? ఈ ఘటనకు, ఆయనను వీఆర్‌కు పంపడానికి ఏమైనా సంబంధం ఉందా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. గత ఆరోపణలపై మళ్లీ చర్చ సీఐ మల్లికార్జునపై గతంలో వచ్చిన వివిధ ఆరోపణలు కూడా ఇప్పుడు మళ్లీ చర్చకు వస్తున్నాయి. ఆయన కుటుంబ సభ్యులపై కూడా గతంలో కొన్ని ఆరోపణలు వచ్చాయని, వాటిపై సంబంధిత అధికారులు విచారణ జరిపి నిజానిజాలు వెల్లడించాలని కొందరు ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలు అధికారికంగా నిరూపితమైనవి కావని, సంబంధిత వ్యక్తుల స్పందన కూడా అందుబాటులో లేదని పేర్కొనాలి. సీఐని కేవలం వీఆర్‌కు పంపడం కాకుండా, అవసరమైతే పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆరోపణల్లో నిజం ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నాయి. పరవాడ సీఐ మల్లికార్జునను వీఆర్‌కు పంపిన అసలు కారణాలపై పోలీసు శాఖ అధికారికంగా వివరణ ఇవ్వాల్సి ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# సంపాదకీయం

## నింగి మురిసింది.. నేల పులకించింది

### - మృగశిర మురిపెం దాటి..
### ముసురు జల్లుల్లో మురుస్తున్న ముంగిళ్లు



భానుడి భగభగలకు చరమగీతం పాడుతూ, మృగశిర కార్తె తెచ్చిన తొలి చినుకుల తడి ఆరిపోకముందే... ప్రకృతి ఇప్పుడు సరికొత్త మేఘ వర్ణ శోభితాన్ని సంతరించుకుంది. జూన్ ద్వితీయార్థంలో రుతుపవనాలు పూర్తిస్థాయిలో స్థిరపడటంతో, దోబూచులాడిన ఎండలు మటుమాయమై నింగి-నేల ఏకమయ్యే వర్షకాల వైభవం కళ్లముందు సాక్షాత్కరిస్తోంది.

**ఆకుపచ్చని ఆశల హరివిల్లు**

మృగశిర కార్తె ఇచ్చిన భరోసాతో సాగు సరంజామా సిద్ధం చేసుకున్న అన్నదాత, ఇప్పుడు నల్లమబ్బుల రాకతో మరింత ఉత్సాహంగా పొలంలోకి అడుగుపెట్టాడు. ఎటు చూసినా విత్తనాలు నాటే హడావుడి, వరి నార్లు పోసే శ్రమ జీవుల సందడి పల్లెల్లో కొత్త చైతన్యాన్ని నింపుతోంది. ఎండిపోయిన వాగులు, వంకలు జీవకళను సంతరించుకుంటుంటే... రైతన్నల కళ్లల్లో ఆకుపచ్చని ఆశల హరివిల్లు కనిపిస్తోంది. ఈ సమృద్ధిగా కురుస్తున్న ముసురు జల్లులు రాబోయే అద్భుతమైన పంట దిగుబడికి శుభసూచికలు.

**జీవవైవిధ్యానికి జీవం.. పుడమికి పచ్చని తివాచీ..!**

ఈ నిలకడైన ముసురు కేవలం మనుషులకే కాదు, సమస్త జీవకోటికి పునర్జన్మ లాంటిది. నిన్నటివరకు ఎండల దెబ్బకు మాడిపోయిన అడవులు, కొండకోనలు ఇప్పుడు లేత పచ్చదనాన్ని అద్దుకుంటున్నాయి. వలస పక్షుల కిలకిలరావాలు, నదుల గలగలలు ప్రకృతి మాత జరుపుకుంటున్న ఉత్సవాన్ని తలపిస్తున్నాయి. కీటకాలు, పశుపక్ష్యాదులు సైతం తమకు కావలసిన ఆహారం, నీరు సమృద్ధిగా దొరుకుతుండటంతో స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. కాంక్రీట్ వనాల మధ్య నలిగిపోయే నగర జీవులకు కూడా, రోడ్డు పక్కన తడిసిన చెట్ల ఆకులు, చల్లని గాలి ప్రకృతితో విడదీయరాని బంధాన్ని గుర్తుచేస్తూ పులకరింపజేస్తున్నాయి.

**ప్రకృతి ఒడిలో సరికొత్త సేదతీరడం**

పట్టణాలైనా, పల్లెలైనా ఉక్కపోత శకం ముగిసి, చల్లని గాలులు, నిరంతర జల్లుల ముసురుతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. నిత్యం పరుగులతో అలసిపోయే యాంత్రిక జీవనానికి ఈ వర్షపు జల్లులు ఒక మధురమైన విరామ చిహ్నాలు. అద్దాల కిటికీల వెనుక నుండి చూసినా, కప్పు వేడి కాఫీ తాగుతూ ఆస్వాదించినా ఈ కాలం ఇచ్చే అనుభూతి వర్ణనాతీతం.

**సవాళ్లు-సమస్యలు.. అప్రమత్తతే రక్ష**

ప్రకృతి అందించే ఈ పరవశం వెనుక కొన్ని సవాళ్లు కూడా పొంచి ఉన్నాయి. వర్షాలు నిలకడగా సాగుతున్న ఈ తరుణంలోనే కాలానుగుణంగా వచ్చే వ్యాధులు (సీజనల్ ఫీవర్స్) పంజా విసిరే ప్రమాదం ఉంది.

ప్రజల బాధ్యత: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమలు ప్రబలకుండా జాగ్రత్తపడటం, కాచి చల్లార్చిన నీటిని తాగడం.

ప్రభుత్వాల విధి: నగరాలు, పట్టణాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థను పర్యవేక్షించడం, లోతట్టు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేయడం, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడం.

**సమర్పణ:**

మృగశిర కార్తె ఒక ఆశను రేకెత్తిస్తే... ఆ తర్వాతి కాలం ఆ ఆశను నిజం చేసే బాధ్యతను తీసుకుంటుంది. నిలకడగా కురుస్తున్న ఈ అమృత ధారలను ఒడిసి పట్టుకుంటూ, భూగర్భ జలాలను పెంచుకుంటూ, పర్యావరణాన్ని కాపాడుకుంటూ... ఈ వర్ష రుతువును మనసారా ఆస్వాదిద్దాం, సంపూర్ణంగా జీవిద్దాం!

**సంపాదకులు :**

**'ప్రజా ప్రతిభ' చీఫ్ ఎడిటర్ దానూరి శ్రీనివాసరావు**

## యర్రగొండపాలెం రాజకీయాల్లో కొత్త చర్చ

# తాటిపర్తికి మాజీ ఎమ్మెల్యే మద్దతు

యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, జూన్ 18,(ప్రజా ప్రతిభ).

మార్కాపురం జిల్లా రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. యర్రగొండపాలెం నియోజకవర్గ టికెట్ కేటాయింపుపై సీనియర్ రాజకీయ నేత, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి పలువురు ఆశావాహులు ఉన్నప్పటికీ, ప్రజల్లో బలమైన ఆదరణ కలిగిన నాయకుడు తాటిపర్తి మాత్రమేనని కొండారెడ్డి పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను దృష్టిలో ఉంచుకుని యర్రగొండపాలెం టికెట్‌ను తాటిపర్తికి కేటాయించాలని ఆయన స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం సరైన నిర్ణయం తీసుకుని తాటిపర్తికి అవకాశం కల్పిస్తే భారీ మెజారిటీతో విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని కొండారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గెలుపే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగాలంటే ప్రజాదరణ కలిగిన నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తాటిపర్తి నాయకత్వ లక్షణాలు, ప్రజలతో ఆయనకు ఉన్న సన్నిహిత అనుబంధం, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి కారణంగానే ప్రజల్లో విశేష ఆదరణ పొందారని కొండారెడ్డి అన్నారు. పార్టీ అధిష్ఠానం తాటిపర్తికి అవకాశం కల్పిస్తే భారీ మెజారిటీతో విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.కేపీ కొండారెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు యర్రగొండపాలెం రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టికెట్ అంశంపై ఇప్పటికే చర్చలు జోరుగా సాగుతున్న తరుణంలో ఆయన చేసిన ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.



## పరవాడ నూతన సీఐగా ఎల్. భాస్కరరావు బాధ్యతల స్వీకరణ



పరవాడ, జూన్ 18 (ప్రజా ప్రతిభ):

పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా ఎల్. భాస్కరరావు నియమితులయ్యారు. ఇంతకాలం పరవాడ సీఐగా విధులు నిర్వహించిన ఆర్. మల్లికార్జునరావు శ్రీకాకుళం వీఆర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఎల్. భాస్కరరావు బాధ్యతలు స్వీకరించారు.శ్రీకాకుళం వీఆర్ నుంచి బదిలీపై పరవాడకు వచ్చిన ఎల్. భాస్కరరావు గురువారం అధికారికంగా సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, పోలీసు-ప్రజల మధ్య సత్సంబంధాల బలోపేతానికి కృషి చేస్తానని నూతన సీఐ ఎల్. భాస్కరరావు పేర్కొన్నట్లు సమాచారం.

# గుండెపోటుతో నసీమ మృతి..

## కుటుంబాన్ని పరామర్శించిన కేపీ నాగార్జున రెడ్డి..

## నివాళులర్పించి ధైర్యం చెప్పిన నాయకులు..

మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , జూన్ 18, ( ప్రజా ప్రతిభ ):

మార్కాపురం జిల్లా, బేస్తవారిపేట పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన షేక్ బషీర్ సతీమణి నసీమ గుండెపోటుతో అకస్మాత్తుగా కన్నుమూశారు. 45 ఏళ్ల వయసులో ఆమె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఆమె నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.నసీమ మృతి విషయం తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యుడు కేపీ నాగార్జున రెడ్డి బేస్తవారిపేటకు చేరుకుని మృతురాలి నివాసానికి వెళ్లారు. ముందుగా నసీమ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న భర్త షేక్ బషీర్, కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అనుకోకుండా సంభవించిన ఈ విషాదాన్ని మనోధైర్యంతో ఎదుర్కోవాలని సూచించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.నసీమ మరణం బేస్తవారిపేటలో విషాద ఛాయలు అలుముకునేలా చేసింది.స్థానికంగా అందరితో ఆప్యాయంగా మెలిగే స్వభావం కలిగిన ఆమె అకాల మరణం పట్టణ ప్రజలను కలచివేసిందని పలువురు పేర్కొన్నారు. చిన్న వయసులోనే ఆమె మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.నివాళుల కార్యక్రమంలో బేస్తవారిపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు వేగనాటి ఓసూరెడ్డి, జిల్లా పరిషత్ ప్రాదేశిక



సభ్యుడు బండ్లమూడి వెంకట రాజయ్య, బేస్తవారిపేట పట్టణ అధ్యక్షుడు మిట్టా చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మృతురాలి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను ఒక్కొక్కరిని పరామర్శిస్తూ ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో ఒంటరిగా భావించవద్దని, అందరూ అండగా ఉంటారని భరోసా కల్పించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని ప్రార్థిస్తూ కార్యక్రమం ముగిసింది.

## ఎస్.కోటలో నియోజకవర్గ స్థాయి ఎన్డీఏ కూటమి విజయోత్సవ సభ




విజయనగరం జిల్లా బ్యూరో, జూన్ 18 (ప్రజా ప్రతిభ):

నియోజకవర్గ స్థాయి ఎన్డీఏ కూటమి విజయోత్సవ సభను జూన్ 19న ఎస్.కోటలో ఘనంగా నిర్వహించనున్నట్లు శాసనసభ్యుల కార్యాలయం వెల్లడించింది. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఎస్.కోటలోని శిరికి ఫంక్షన్ హాల్‌లో ఈ సభ జరగనుంది. రాష్ట్ర అభివృద్ధి, నియోజకవర్గ ప్రగతి, కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ఈ విజయోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ మహోత్సవానికి ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని, తమ అమూల్యమైన సమక్షంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శాసనసభ్యుల కార్యాలయం విజ్ఞప్తి చేసింది.

## ప్రమాదంలో గాయపడిన నాయకుడిని

# పరామర్శించిన కేపీ నాగార్జున రెడ్డి..

## అయ్యవారిపల్లె పంచాయతీ మద్దలమడకలో దద్దనాల నారాయణ రెడ్డికి ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే...

మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , జూన్ 18,( ప్రజా ప్ర) :

మార్కాపురం జిల్లా,అర్ధవీడు మండలం, అయ్యవారిపల్లె పంచాయతీ పరిధిలోని మద్దలమడక గ్రామానికి చెందిన నాయకుడు దద్దనాల నారాయణ రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యుడు కేపీ నాగార్జున రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా నారాయణ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలను తప్పకుండా పాటిస్తూ పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మనోధైర్యంతో ఉంటే త్వరగా కోలుకుంటారని ధైర్యం చెప్పారు. ప్రమాదం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని అవసరమైన సహకారం అందుబాటులో ఉంటుందని భరోసా కల్పించారు.నారాయణ రెడ్డి త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్య చురుకుగా సేవలు అందించాలని





ఆకాంక్షించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, ఏ అవసరం వచ్చినా తమ సహకారం ఉంటుందని తెలిపారు.పరామర్శ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. నారాయణ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సి.రాయవరం ప్రభుత్వ పాఠశాలకు ఐదు ఫ్యాన్లు బహుకరించిన వైసీపీ నేతలు



ప్రత్తిపాడు /తుని, జూన్ 18 (ప్రజా ప్రతిభ) :

ఏలేశ్వరం మండలం సి.రాయవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మాజీ సర్పంచ్ గుమ్ములూరి వెంకటరమణ జగదీశ్వరి ఆధ్వర్యంలో గురువారం స్థానిక వైసీపీ నాయకులు ఐదు సీలింగ్ ఫ్యాన్ల ను ఉచితంగా బహుకరించారు.ఈ సందర్భంగా గుమ్ములూరు వెంకటరమణ మాట్లాడుతూ మాజీ ఉప సర్పంచ్ పోలం వెంకటేశ్వరరావు, గజ్జి సత్తిబాబు, నరాల కామేశ్వరరావు దాతల సహకారంతో ఐదు ఫ్యాన్లను పాఠశాల హెచ్ఎం లాజర్ బాబుకు అందజేయడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో బోట్ట అప్పారావు,గుమ్ములూరి పద్మరాజు,పోలం భద్రం,దేవరరాజు,ఉపాధ్యాయులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దాడిలో గాయపడిన మహిళను

# పరామర్శించిన కేపీ నాగార్జున రెడ్డి..

## కంభం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజితకు ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే..

మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , జూన్ 18, (ప్రజా ప్రతిభ ):

మార్కాపురం జిల్లా,అర్ధవీడు మండలం,మాగుటూరు గ్రామానికి చెందిన యాపాకుల రజిత ఇటీవల గ్రామంలో జరిగిన దాడిలో కత్తిపోట్లకు గురై కంభం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యుడు కేపీ నాగార్జున రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా రజిత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.అవసరమైన చికిత్సను పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు. బాధితురాలితో మాట్లాడి మనోధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, ఇలాంటి క్లిష్ట సమయంలో ధైర్యం కోల్పోవద్దని సూచించారు.గ్రామంలో జరిగిన ఘటనపై ఆవేదన వ్యక్తం చేసిన కేపీ నాగార్జున రెడ్డి, బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చట్టపరంగా వ్యవహరించాలని





కోరారు.శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.పరామర్శ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు మేడూరి వెంకటరావు, పంచాయతీరాజ్ విభాగం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నన్నెబోయిన రవికుమార్, మండల కన్వీనర్ యేరువ రంగారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాధితురాలు త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షిస్తూ అందరూ ధైర్యం చెప్పారు.

# పుష్పాలంకరణ వేడుకలో సందడి..

## పంది వెంకటేశ్వర్లు కుటుంబ వేడుకలో
## పాల్గొన్న కొండారెడ్డి, తాడిపత్రి చంద్రశేఖర్..
## చిన్నారికి ఆశీస్సులు అందించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , జూన్ 18,( ప్రజా ప్రతిభ ):**





మార్కాపురం జిల్లా,ఎర్రగొండపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలం కొమరోలు గ్రామంలో పంది వెంకటేశ్వర్లు మనవరాలి పుష్పాలంకరణ వేడుక ఆత్మీయ వాతావరణంలో జరిగింది. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు, ఆహ్వానితుల సమక్షంలో నిర్వహించిన ఈ వేడుకకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐడీసీ మాజీ చైర్మన్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాడిపత్రి చంద్రశేఖర్ హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు. వేడుక సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించిన వారు, ఆయురారోగ్యాలు, విద్యాభివృద్ధి, సుఖసంతోషాలతో జీవితం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం పంది వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి కుటుంబ వేడుకలు బంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన గ్రామస్థులు, అభిమానులు, నాయకులను ఆత్మీయంగా పలకరించారు.నాయకులు కూడా స్థానికులతో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలతో కొద్దిసేపు ముచ్చటిస్తూ స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు.పుష్పాలంకరణ వేడుక సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాల నడుమ జరిగింది. చిన్నారికి బంధుమిత్రులు ఆశీస్సులు అందజేసి బహుమతులు సమర్పించారు. వేడుకలో కుటుంబ సభ్యుల ఆనందోత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కార్యక్రమంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారికి ఆశీస్సులు అందించారు.

# చెన్నారెడ్డిపల్లి సచివాలయంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.

**యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, జూన్ 18,(ప్రజా ప్రతిభ).**



మార్కాపురం జిల్లా తర్లపాడు మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ విజయ సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలను ఆమె పరిశీలించారు.కార్యాలయ పనితీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సూచించినట్లు సమాచారం. అలాగే కార్యాలయాల్లో క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని సిబ్బందికి ఆదేశించినట్లు తెలిసింది.జిల్లాలో కలెక్టర్ వరుసగా చేపడుతున్న ఆకస్మిక తనిఖీలు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కలెక్టర్ ఎప్పుడు, ఏ కార్యాలయాన్ని సందర్శిస్తారో తెలియని పరిస్థితి నెలకొనడంతో విధులకు సక్రమంగా హాజరుకాని అధికారులు, సిబ్బందిలో ఆందోళన వ్యక్తమవుతోంది.కార్యాలయాలకు రాకుండానే హాజరు నమోదు చేస్తున్న వారిపై కూడా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని సమాచారం. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులకు కలెక్టర్ తనిఖీలు తలనొప్పిగా మారుతున్నప్పటికీ, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా పరిపాలనలో క్రమశిక్షణ పెంపుతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొంటున్నారు.

## త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో
# ఘనంగా 'యోగాంధ్ర' కార్యక్రమం.

**యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, జూన్ 18,(ప్రజా ప్రతిభ).**






అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమం త్రిపురాంతకం పట్టణంలోని ప్రసిద్ధ త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఘనంగా జరిగింది. ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం. విజయ సునీత ముఖ్య అతిథిగా హాజరై యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన ఆరోగ్య వరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చని అన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు ప్రతి రోజు కొంత సమయం యోగాభ్యాసానికి కేటాయించాలని సూచించారు.కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో శివ రామిరెడ్డి, డీఈఓతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. యోగ గురువు రఘు ఆధ్వర్యంలో యోగ సాధకులు వివిధ యోగాసనాలను ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, ఆరోగ్య చైతన్యాల సమ్మేళనంగా నిలిచింది. యోగ సాధన ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

# ఎస్ఐఆర్ సర్వేకు సహకరించాలి

**అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడి ఓటు హక్కు కోల్పోకుండా చూడడమే "ఎస్ఐఆర్" ముఖ్య ఉద్దేశం**

**76, 79వ బూత్ లో ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ నాయబ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మార్కెట్ రాజు, యూత్ వింగ్ లడ్డు**

**నందికొట్కూరు, జూన్ 18, (ప్రజా ప్రతిభ):**





భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)–2026' కార్యక్రమం ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేని పారదర్శక ఓటర్ల జాబితా కోసమే రూపొందించేందుకు ఉద్దేశించిన కీలక ప్రక్రియ అని 7వ వార్డు మాజీ కౌన్సిలర్ నాయబ్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మార్కెట్ రాజు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు లడ్డు పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 76, 79 బూత్ లలో ఎన్నికల బిఎల్ఓ వెంకటస్వామి, రాంబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమంలో నాయబ్, మార్కెట్ రాజు, లడ్డు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'సర్–2026' కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలను తెలుసుకోవడంతో పాటు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను సూచించారు. ఓటర్ల జాబితాలోని తప్పొప్పులను సరిదిద్దడం, అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయడం, అనర్హుల పేర్లను తొలగించడం ద్వారా విశ్వసనీయమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్యానికి అసలైన బలం ఓటు హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా ఎస్ఐఆర్ సర్వే జరుగుతుందన్నారు. నకిలీ ఓట్లు, ఒకటి కంటే ఎక్కువ ఉన్న ఓట్లను తొలగించడం, మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడం, అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా చూడడమే ఎస్ఐఆర్ సర్వే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఇంటికి వచ్చే బిఎల్ఓ, బిఎల్ఏ లకు సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ఈ "ఎస్ఐఆర్ –2026" కార్యక్రమానికి సహకరించాలనివారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఏ జావీద్, షేక్ అబ్దుల్ సలాం, సెంట్రింగ్ మా బాషా, గౌండ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి జెడ్పీహెచ్ పాఠశాలను
# ఆకస్మిక తనిఖీ చేసిన డీఈఓ.



**యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, జూన్ 18,(ప్రజా ప్రతిభ).**

త్రిపురాంతకం మండలంలోని గొల్లపల్లి జెడ్పీహెచ్ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) సుబ్బారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వివిధ తరగతి గదులను సందర్శించి బోధన, అభ్యాస ప్రక్రియలను పరిశీలించారు.విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి విద్యా ప్రగతి, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల హాజరు నమోదు వివరాలను పరిశీలించి, హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.పాఠశాల నిర్వహణ, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, విద్యా వాతావరణం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన డీఈఓ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రతను నిరంతరం పాటిస్తూ విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించాలని ఆదేశించారు.ఈ తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎర్రగొండపాలెంలో కేపీ కొండారెడ్డి ని
## ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే తాడి పత్రి...







**మార్కాపురం జిల్లా బ్యూరో /లుంజల శేఖర్ , జూన్ 18, (ప్రజా ప్రతిభ ):**

మార్కాపురం జిల్లా, ఎర్రగొండపాలెం నియోజకవర్గ రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐడీసీ మాజీ చైర్మన్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కె.పీ. కొండారెడ్డి ఎర్రగొండపాలెం పట్టణంలో ఎమ్మెల్యే తాడిపత్రి చంద్రశేఖర్ ఆహ్వానం మేరకు ఆయన కార్యాలయాన్ని గురువారం సందర్శించారు.కార్యాలయానికి చేరుకున్న కొండారెడ్డికి ఎమ్మెల్యే తాడిపత్రి చంద్రశేఖర్‌తో పాటు నియోజకవర్గ ముఖ్య నాయకులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు పరస్పరం ఆప్యాయంగా పలకరించుకొని, నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు తెలిసింది.రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన కొండారెడ్డి రాకతో కార్యాలయంలో సందడి నెలకొంది. పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొండారెడ్డి ప్రజా జీవితంలో అందించిన సేవలను నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

## పెద్ద రాజయ్య మృతికి
## నివాళులర్పించిన అన్నా రాంబాబు..

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , జూన్ 18, (ప్రజా ప్రతిభ ):**

మార్కాపురం జిల్లా, తర్లుపాడు మండలం, భూపతిపల్లె గ్రామానికి చెందిన బొమ్మనబోయిన పెద్ద రాజయ్య మృతికి మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు నివాళులర్పించారు. పెద్ద రాజయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న అన్నా రాంబాబు గురువారం భూపతిపల్లె గ్రామానికి చేరుకుని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్ద రాజయ్య కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పెద్ద రాజయ్య గ్రామంలో అందరితో సత్సంబంధాలు కలిగి, నిరాడంబర జీవితం గడిపిన వ్యక్తిగా గుర్తింపు పొందారని స్థానికులు పేర్కొన్నారు. ఆయన మృతి గ్రామానికి తీరని లోటని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నా రాంబాబుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పెద్ద రాజయ్యకు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.



## కమలబంధ గ్రామంలో ఎస్ ఐ ర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై అవగాహన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ



ఆలూరి జిల్లా/డుంబ్రిగూడ, జూన్ 18(ప్రజా ప్రతిభ)

డుంబ్రిగుడ మండలంలోని సొవ్వ పంచాయతీ పరిధిలోని జె ఓ అధికారులు గ్రామస్తులకు కీలక సూచనలు చేశారు. ఓటు హక్కు కలిగిన ప్రతి వ్యక్తి తప్పనిసరిగా రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు, కుల ధృవీకరణ పత్రం (క్యాస్ట్ సర్టిఫికేట్) జిరాక్స్ కాపీలను సంబంధిత బిఎల్ ఓ అధికారికి అందజేయాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయబడతాయని, వాటిని ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేసి తిరిగి బి ఎల్ ఓ అధికారికి సమర్పించాలని తెలిపారు. ఈ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసిన వారికే ఓటరు జాబితాలో పేరు కొనసాగుతుందని అవగాహన కల్పించారు.గ్రామస్తులకు ఈ విషయాన్ని వైఎస్సార్సీపీ నాయకుడు వంతాల గురు నాయుడు వివరించారు. ప్రజలు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవడానికి అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, బి ఎల్ ఓ అధికారులు ఎమ్.బుజ్జి, అప్పారావు, నాగ సుమాంజలి, స్థానిక వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు పాంగి నాగేశ్వరావు (మాజీ వార్డు సభ్యులు), వైఎస్సార్సీపీ సొవ్వ పంచాయితీ బూత్ లెవెల్ ఏజెంట్ పాంగి కురంజాన్, నాయకులు పి.భీమరాజు, బాలకృష్ణ, స్థానిక టీడీపీ నాయకులు పాంగి మోహన్ దాస్, పాంగి చిరంజీవి, వంతల లింగమూర్తి, కొర్రా చిన్నయ్య అలానే స్థానిక సీపీఎం నాయకులు పాంగి మత్తు, వసంత్ కుమార్, జనసేన నాయకులు లల్లోష్ కుమార్, కృష్ణ కుమార్, మాజీ వార్డు సభ్యులు పాంగి లింగమూర్తి, పీసా సభ్యులు, గ్రామ పెద్దలు పాంగి బంగారయ్య, వంతాల అలుసు, పాంగి ఆనందరావు, పాంగి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగపేట గ్రామంలో సీడ్ బాల్స్ పై అవగాహనా కార్యక్రమం



చింతూరు జూన్ 18 (ప్రజా ప్రతిభ)

పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చింతూరు మండలం నర్సింగపేట గ్రామంలో "సీడ్ బాల్స్ పై అవగాహనా కార్యక్రమం" ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది మాట్లాడుతూ, ప్రతి రైతు తమ గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో సీడ్ బాల్స్ తయారు చేసి వేయాలని పిలుపునిచ్చారు. సీడ్ బాల్స్ అంటే మట్టిలో విత్తనం ఉంచి చిన్న బంతులుగా చేసి, చెట్లు లేని ఖాళీ స్థలాల్లో విసిరివేయడం వల్ల చీడపీడల నుండి రక్షణ లభించి మొక్కలు సహజంగా పెరుగుతాయని వివరించారు.ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మానవాళి జీవన విధానానికి ప్రతికూలంగా మారుతున్నాయని, వీటిని అధిగమించాలంటే విస్తృతంగా మొక్కలు పెంచాలని సూచించారు. దీని ద్వారా జీవైవిధ్యం పెరుగుతుందని, వాతావరణ మార్పులు తగ్గి సకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సిబ్బంది, స్థానిక రైతులు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ

ప్రత్తిపాడు/తుని, జూన్ 18 (ప్రజా ప్రతిభ) :

ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత ఆర్థిక సాయంతో గురువారం ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ చలివేంద్రాన్ని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు,టిడిపి సీనియర్ నాయకులు,మాజీ కౌన్సిలర్ అలమండ చలమయ్య ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ అనసూయ నాగేశ్వరరావు, రౌతు సహదేవుడు,బోద చిరంజీవి,కడింశెట్టి వాసు,చలంచర్ల నాగేశ్వరరావు,సిరిపుడ్ కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

### 20న వీఎస్ఎన్ ఫంక్షన్ హాల్ లో శిక్షణ తరగతుల నిర్వహణ

### సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏం.నాగేశ్వరరావు

నందికొట్కూరు, జూన్ 18, (ప్రజా ప్రతిభ):

పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో గల వీఎస్ఎన్ ఫంక్షన్ హాల్ నందు జూన్ 20న జరగబోవు సీపీఎం పార్టీ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. నాగేశ్వరావు పిలుపునిచ్చారు. గురువారం సీపీఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం నాయకులు పి.పక్కిర్ సాహెబ్, ఎం.కర్ణ, టి.గోపాలకృష్ణ లతో కలిసి విలేకరుల సమావేశంలో ఎం.నాగేశ్వరావు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ శనివారం పగిడ్యాల రోడ్డులో గల విఎస్ఎన్ ఫంక్షన్ హాల్ లో రాజకీయ శిక్షణ తరగతులు జరుగుతున్నాయన్నారు. ఈ శిక్షణా తరగతులకు జూపాడు బంగ్లా, మిడుతూరు, పగిడ్యాల, నందికొట్కూరు మండలాల నుండి సీపీఎం పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రధానంగా దేశంలో కేంద్రంలో నరేంద్ర మోడీ విధానాలు, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పైన చర్చించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తు ప్రణాళికను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పరిపాలన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల పరిపాలన ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వారి ప్రయోజనాల కోసం ప్రజల పైన విచ్చలవిడిగా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, ఎరువుల ధరలు, నిత్యవసర సరుకుల ధరలు ఆకాశానంటుతున్నాయని వారు ఆరోపించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు యువతకు హామీ ఇచ్చి అధికారంలోకి



వచ్చిన తర్వాత విస్మరిస్తున్నారని విమర్శించారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తామని ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను గాలికి వదిలిపెట్టారని వారు ఆరోపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ రాజకీయ శిక్షణ తరగతుల్లో పార్టీ కార్యకర్తలకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులు బోధించడానికి సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్, సీపీఎం జిల్లా నాయకులు హాజరవుతారని నాగేశ్వరరావు తెలిపారు.

# ఖబర్దార్ గుడివాడ అమర్నాథ్..!


### నోరు అదుపులో పెట్టుకో...

### మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు.

### టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు నిమ్మకాయల మోహన్, కాటేపోగు నాగ సురేష్

నందికొట్కూరు, జూన్ 18, (ప్రజా ప్రతిభ):

వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే సహించేది లేదని తగిన రీతిలో బుద్ధి చెబుతామని తక్షణమే హోంమంత్రి అనితమ్మ కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు నిమ్మకాయల మోహన్, నాగ సురేష్, కుమార్ రాజా హెచ్చరించారు. గురువారం పత్రిక విలేకరులతో వారు మాట్లాడుతూ వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ హోంమంత్రి అనిత పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మహిళలను గౌరవించే సంస్కృతి లేదనడానికి గౌరవప్రదమైన స్థానంలో ఉన్న హోంమంత్రి అనిత పై వైసిపి నేత మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమన్నారు. వైసీపీ నేతలు మోసపూరితపైన, దౌర్జన్యపరమైన పాలన చేయడం వల్లే గత ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడంతో 11 సీట్లకే పరిమితమైన విషయాన్ని మైమర్చి నేడు మహిళలపై అసభ్యకరంగా మాట్లాడడం వైసీపీ నాయకులకే చెల్లుబాటు అవుతుందన్నారు. ఉపాధ్యాయురాలుగా ఎంతోమంది విద్యార్థులను



తీర్చిదిద్ది , ఎంతో ప్రతిభ ఉండి, సమాజ సేవాతత్వం కలిగిన వంగలపూడి అనితపై ఎంతో నమ్మకంతో గౌరప్రదమైన స్థానంలో మహిళలను గౌరవిస్తూ తమ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హోంమంత్రి స్థానంలో నిలబెట్టారని అది తమ పార్టీలో మహిళలకు దక్కే గౌరవం అన్నారు. అలాంటి గౌరవప్రదమైన స్థానంలో ఉన్న మహిళ హోమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే హోం మంత్రి అనితమ్మకు మరియు మహిళా లోకానికి తక్షణమే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

# మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం

### మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం

### అవగాహన కార్యక్రమంలో బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ మణికంఠ

నందికొట్కూరు, జూన్ 18, (ప్రజా ప్రతిభ):

మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవనం నాశనమవుతుందని బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ మణికంఠ సూచించారు. బుధవారం గంజాయి ఇతర మాదకద్రవ్యాల మూలాలతో పాటు నిర్మూలించేందుకు ప్రజలను చైతన్యవంతులుగా చేయాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాలమేరకు బ్రాహ్మణకోట్కూరు గ్రామంలోని మద్దురునగర్ నందు బుధవారం మాదకద్రవ్యాల నివారణ మరియు వాటి దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు బ్రాహ్మణకోట్కూరు సబ్ ఇన్‌స్పెక్టర్ మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎస్ఐ మణికంఠ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన వ్యక్తులు ఎదుర్కొన్న సమస్యలు, వాటి కారణంగా సంభవించిన నేరాలు మరియు సామాజిక పరిణామాలకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన కేస్ స్టడీస్‌ను ఉదాహరణలుగా వివరించి ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గమనించినట్లయితే వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించి సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు



సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, మహిళలు మరియు ఇతర ప్రముఖులు పాల్గొని మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన పొందారు. సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మద్దూరు నగర్ కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పటిష్టమైన ఓటర్ల జాబితా కోసమే ఎస్ఐఆర్

### అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా చూడడమే "ఎస్ఐఆర్" ముఖ్య ఉద్దేశం

### ఎస్ఐఆర్ సర్వేకు సహకరించాలని కోరిన టీడీపీ బైరాపురం ఇంచార్జ్ చాకర్ వలి

నందికొట్కూరు, జూన్ 18, (ప్రజా ప్రతిభ):

భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)-2026' కార్యక్రమం ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేని పారదర్శక ఓటర్ల జాబితా కోసమే రూపొందించేందుకు ఉద్దేశించిన కీలక ప్రక్రియ అని తెలుగుదేశం పార్టీ బైరాపురం ఇంచార్జ్ మొల్లా చాకర్ వలి స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాకర్ వలి మాట్లాడుతూ 'సర్-2026' కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలను తెలుసుకోవడంతో పాటు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను సూచించారు. ఓటర్ల జాబితాలోని తప్పొప్పులను సరిదిద్దడం, అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయడం, అనర్హుల పేర్లను తొలగించడం ద్వారా విశ్వసనీయమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్యానికి అసలైన బలం ఓటు హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా ఎస్ఐఆర్ సర్వే జరుగుతుందన్నారు. నకిలీ ఓట్లు, ఒకటి కంటే ఎక్కువ ఉన్న ఓట్లను తొలగించడం, మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడం, అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా చూడడమే ఎస్ఐఆర్ సర్వే



ముఖ్య ఉద్దేశమని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పారదర్శకతకు, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉంటుందని భరోసానిచ్చారు. ఇంటికి వచ్చే బిఎల్ఓ, బిఎల్ఏ లకు సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ఈ "ఎస్ఐఆర్ -2026" కార్యక్రమానికి సహకరించాలని మొల్ల చాకర్ వలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జి. వెంకటేశమయ్య, మొల్ల జబ్బార్, మాల పాల్ గురా తదితరులు పాల్గొన్నారు.

## తాడి గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షను

# నెరవేర్చే బాధ్యత నాది: ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

### తాడి గ్రామ తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యేను కలిసిన కూటమి నాయకులు

### లబ్ధిదారుల సంఖ్య పెరగడంతోనే జాప్యం.. త్వరలో సురక్షిత ప్రాంతానికి తరలింపు



**పరవాడ, జూన్ 19 (ప్రజా ప్రతిభ):**

తాడి గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన గ్రామ తరలింపును తప్పకుండా పూర్తి చేసి, సురక్షిత ప్రాంతానికి తరలించే బాధ్యత తనదేనని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు.పరవాడ మండలం ఎకోనా హోటల్‌లో గురువారం తాడి గ్రామ తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ తాడి కూటమి నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ గ్రామ తరలింపు ప్రక్రియలో ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, గత ఎన్నికల సమయంలో గెలిచిన వెంటనే తాడి గ్రామాన్ని తరలిస్తానని ఇచ్చిన హామీ తనకు గుర్తుందని చెప్పారు. ఆ హామీ అమలుకు కట్టుబడి ఉన్నానని, అసెంబ్లీలో పలుమార్లు ఈ అంశాన్ని ప్రస్తావించడంతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వెల్లడించారు. కలెక్టర్ల సమావేశంలో ఈ అంశంపై సీఎం ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నానని తెలిపారు.అలాగే ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లా కలెక్టర్‌లతో ప్రతి సమావేశంలో తాడి గ్రామ తరలింపు అంశాన్ని ప్రస్తావిస్తున్నానని చెప్పారు. ఒక పెద్ద గ్రామ పంచాయతీని పూర్తిస్థాయిలో తరలించాలంటే లబ్ధిదారుల గుర్తింపు, స్థల ఎంపిక, మౌలిక వసతుల కల్పన, నిధుల సమీకరణ వంటి అనేక అంశాలను జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుందని వివరించారు.2009లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే తాడి గ్రామ తరలింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టామని, అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల అది పూర్తి కాలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం గ్రామంలో లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు తరలింపుకు అవసరమైన వ్యయం కూడా మూడు రెట్లు పెరిగిందని తెలిపారు.ఇటీవలే తాడి గ్రామ తరలింపుకు అనువైన స్థలాలను పరిశీలించామని, అన్ని ప్రక్రియలు పూర్తి చేసి త్వరలోనే గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తాడి గ్రామ ప్రజల దశాబ్దాల కలను సాకారం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## ఫైలేరియా నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన

# జనసేన నేత వబ్బిన సన్యాసి నాయుడు

### చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు టీకాలు తప్పనిసరి

### తిమిడి హెల్త్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైన కార్యక్రమం



**విజయనగరం జిల్లా బ్యూరో, జూన్ 18 (ప్రజా ప్రతిభ):**

ఎస్.కోట నియోజకవర్గంలోని తిమిడి సచివాలయ హెల్త్ సెంటర్‌లో గురువారం ఫైలేరియా నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫైలేరియా వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం చేపడుతున్న టీకాల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా 5, 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరూ తప్పనిసరిగా టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండటమే కాకుండా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.

పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించిన ఆయన, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడం అవసరమని పేర్కొన్నారు. చిన్నారులకు టీకాల ప్రాముఖ్యతను వివరించి తల్లిదండ్రులను చైతన్యపరిచారు.కార్యక్రమంలో తిమిడి ఏఎన్ఎం ఏర్నమ్మ, వైద్య సిబ్బంది సత్యారావు, మూర్తి, కృష్ణంనాయుడు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే తిమిడి, వసి, వేచలపూడి గ్రామాలకు చెందిన 5, 6 సంవత్సరాల చిన్నారులు టీకాలు వేయించుకుని కార్యక్రమంలో భాగమయ్యారు.వైద్య సిబ్బంది ఫైలేరియా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, టీకాల అవసరంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రజల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు.

# రోడ్డు లేక ‘చిట్టెంపాడు’ గిరిజనుల అవస్థలు

పర్యాటకులకు తప్పని ప్రాణసంకటం.
అధికారుల నిర్లక్ష్యంతో నరకప్రాయంగా మారిన ఘాట్ రోడ్డు.
అత్యవసర వేళల్లో డోలీలే శరణ్యం.
గ్రామస్థుల ఆవేదన.
వాటర్ ఫాల్స్ అందాలు చూడాలంటే సాహసయాత్ర చేయాల్సిందేనంటున్న పర్యాటకులు.



**అనంతగిరి,న్యూస్ : అరకులోయ, జూన్ 18( ప్రజాప్రతిభ ):**


అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం, టోకూరు పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన చిట్టెంపాడుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అటు స్థానిక గిరిజనులు, ఇటు సందర్శకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రకృతి ఒడిలో దాగి ఉన్న అద్భుతమైన ‘చిట్టెంపాడు జలపాతం’ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నప్పటికీ, అక్కడికి వెళ్లే మార్గం నరకప్రాయంగా మారడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**దశాబ్దాల వినతులు బుట్టదాఖలు.**

గ్రామస్థుల కన్నీటి గాథచిట్టెంపాడు గ్రామానికి నేటికీ సరైన రవాణా సౌకర్యం లేదు. దశాబ్దాలుగా ఇక్కడి గిరిజనులు సరైన రోడ్డు కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం నడవడానికి కూడా వీల్లేని విధంగా ఉన్న ఘాట్ రోడ్డు కారణంగా గ్రామస్థులు బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, అస్వస్థతకు గురైన రోగులను అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి తరలించాలంటే కిలోమీటర్ల మేర డోలీలలో మోసుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రకృతి ప్రేమికులకు తప్పని కష్టాలు...ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణం**

ఈ జలపాతం అందాలను ఆస్వాదించేందుకు ప్రతి వారాంతంలో వందలాది మంది ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. అయితే, వాహనాలు వెళ్లేందుకు వీల్లేని ఇరుకైన, గుంతలమయమైన మరియు నిటారుగా ఉండే కొండ మార్గం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలను చాలా దూరంలోనే నిలిపివేసి, దట్టమైన అడవి, జారే బండరాళ్లు మరియు కొండ అంచుల గుండా కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోంది. ఏమాత్రం కాలు జారినా ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉందని పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస పర్యాటక సౌకర్యాలు కూడా ఇక్కడ కరువయ్యాయని వారు పేర్కొంటున్నారు.



**.ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.**

ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మేధావులు, ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, ఐటీడీఏ అధికారులు మరియు పర్యాటక శాఖ స్పందించి, చిట్టెంపాడుకు వెంటనే శాశ్వత బీటీ లేదా సిమెంట్ రహదారిని నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## శాంతి లే అవుట్‌లో

# నూతన విద్యుత్ సౌకర్యాల ఏర్పాటు.



**కుప్పం, జూన్ -18(ప్రజా ప్రతిభ):**

కుప్పం మున్సిపాలిటీ 11వ క్లస్టర్ పరిధిలోని చిన్నకురబపల్లి శాంతి లేఅవుట్‌లో ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు నూతన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులు చేపట్టినట్లు 11వ క్లస్టర్ ఇంచార్జి కన్నన్, రెస్కో డైరెక్టర్ శివ దేవర్ తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ సౌకర్యాల వల్ల స్థానిక ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందడంతో పాటు భవిష్యత్ అవసరాలకు కూడా ఉపయోగపడనుంది. ప్రజల సమస్యలను గుర్తించి దశలవారీగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని నాయకులు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. కుప్పం ప్రాంతంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రెసిడెంట్ భాస్కర్, సాయికుమార్, బూత్ ఇంచార్జ్ ఉమశంకర్,రెస్కో సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కుప్పంలో హాకీ శిక్షణ కేంద్రం

# ఏర్పాటుకు కసరత్తు







**కుప్పం, జూన్ -18(ప్రజా ప్రతిభ):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి మార్గదర్శకత్వంలో కుప్పం నియోజకవర్గంలో హాకీ క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏఏపి) డైరెక్టర్, అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి, రెండుసార్లు ఒలింపియన్, ఆసియా క్రీడల్లో రజత పతక విజేత, కామన్వెల్త్ క్రీడల్లో కాంస్య పతక విజేత శ్రీమతి రజిని కుప్పం పర్యటన నిర్వహించారు.ఈ పర్యటనలో భాగంగా ఆమె కుప్పంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, హాకీ శిక్షణ కేంద్రం స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా మైదానాలు, విద్యార్థుల ఆసక్తి తదితర అంశాలను పరిశీలించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో హాకీ ప్రతిభను వెలికితీసి వారికి ఉన్నత స్థాయి శిక్షణ అందించడమే ఈ కేంద్రం లక్ష్యమని తెలిపారు.అనంతరం శ్రీమతి రజిని, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ ని,ఆర్టీసీ వైస్-చైర్మన్ పి.ఎస్. మునిరత్నంని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధి, హాకీతో పాటు ఇతర క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డిఎస్డిఓ భాస్కర్ , సీనియర్ కోచ్ ప్రసన్న కుమార్ రెడ్డి , స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మహేష్ , పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు. హాకీ శిక్షణ కేంద్రం ఏర్పాటుతో కుప్పం ప్రాంతం నుంచి మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారవుతారని పాల్గొన్న వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏలేశ్వరంలో బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ పుట్టినరోజు వేడుకలు





**ప్రత్తిపాడు/తుని, జూన్ 18 (ప్రజా ప్రతిభ) :**

ఏలేశ్వరం పట్టణంలో భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ పుట్టినరోజు వేడుకలను ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీవై పార్టీ ఇంచార్జ్ గొంప శివకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ సెంటర్లో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు.అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు,పాలు,రొట్టెలు అందజేశారు.ఈ సందర్భంగా శివ కుమార్ యాదవ్ మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం పోరాడే బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ కు ముందుగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం అన్ని మండలాల్లో ప్రతి గ్రామంలోనూ పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని,భవిష్యత్తులో అత్యున్నత పదవులు చేపట్టాలని కోరుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సి.రాయవరం మాజీ సర్పంచ్ దేవర శ్రీను,సానబోయిన కుసరాజు,నైదాని రఘు,గారా బాబ్జి,ఇందుకూరి వర్మ,ఈసరపు నాగేంద్ర,గానుగుల మణికంఠ,ఈపి లోవరాజు,దేవర ప్రసాద్,ఆకుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కాలనీలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ

### విద్యాభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి అభినందనీయం



**కుప్పం, జూన్ 18, (ప్రజా ప్రతిభ):**

కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో గల ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. 11వ క్లస్టర్ ఇంచార్జి కన్నన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెస్త కుల కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, యూనిట్ ఇంచార్జి సుబ్రమణి, స్థానిక కౌన్సిలర్ అభ్యర్థి రవి తదితరులు పాల్గొని విద్యార్థులకు యూనిఫాంలను, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా యూనిఫాంలు, పుస్తకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వారు కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం వంటి అంశాల్లో ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని నాయకులు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, క్లస్టర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ టిబి ముక్త భారత్ అభియాన్ 2.0 కార్యక్రమం





**కుప్పం, జూన్ 18, (ప్రజా ప్రతిభ):**

కుప్పంలోని పీఈఎస్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో జాతీయ టిబి ముక్త భారత్ అభియాన్ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిబి బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ చేపట్టారు. చిత్తూరు జిల్లా టిబి నియంత్రణ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఈఎస్ మెడికల్ కాలేజీ మెడిసిన్ విభాగాధిపతి కీలక ప్రసంగం చేశారు. టిబి వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల సహకారం అవసరమని, బాధితులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు. టిబి వ్యాధిపై అపోహలను వీడి, ప్రారంభ దశలోనే లక్షణాలను గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. నిరంతర చికిత్సతో వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని, సమాజంలోని ప్రతి ఒక్కరూ టిబి నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడిసిన్ విభాగం వైద్యులు, టిబి విభాగ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# హోం మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు

### గుడివాడ అమర్నాథ్‌పై చర్యలకు మహిళా నేతలు ఫిర్యాదు

### నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో అనకాపల్లి జిల్లా జనసేన మహిళా విభాగం ఆందోళన --- దళిత మహిళ ఆత్మగౌరవాన్ని కించపరిచారంటూ ఆగ్రహం





**నక్కపల్లి, జూన్ 18, (ప్రజా ప్రతిభ) :**

రాష్ట్ర హోం మంత్రి, దళిత మహిళ అయిన వంగలపూడి అనిత పై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ అనకాపల్లి జిల్లా జనసేన పార్టీ మహిళా విభాగం నేతలు గురువారం నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.అనకాపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు మల్లపురెడ్డి రామకుమారి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మున్నిషా బేగం, ఎస్. రాయవరం మండల అధ్యక్షురాలు నాగలక్ష్మి, జనసేన పార్టీ పాయకరావుపేట మండల అధ్యక్షురాలు నారపరెడ్డి పద్మావతి తదితర మహిళా నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నక్కపల్లి సీఐ మురళికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ, "గత ప్రభుత్వంలో మంత్రి హోదాలో పనిచేసిన వ్యక్తి, ప్రస్తుత రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితపై గుడివాడ అమర్నాథ్ అత్యంత దారుణంగా, అనుచితంగా మాట్లాడడం సిగ్గుచేటని ఆయన వ్యాఖ్యలు కేవలం ఒక మహిళనే కాకుండా, దళిత మహిళ ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయి" అని మండిపడ్డారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న మహిళా మంత్రిపై ఇటువంటి భాష వాడటం రాజకీయ విలువలకు పూర్తిగా విరుద్ధమని, ఇది రాష్ట్రంలోని మహిళా లోకాన్ని అవమానించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు, గుడివాడ అమర్నాథ్‌పై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు.ఫిర్యాదును స్వీకరించిన నక్కపల్లి సీఐ మురళి, విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మహిళా నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఏవి రావు ఫౌండేషన్ మెట్టు దళితవాడ అంగనవాడి కేంద్రాల్లో సామూహిక శ్రీమంతాలు,





**చిట్టమూరు జూన్ 18 ప్రజా ప్రతిభ**

తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం మెట్టు దళితవాడ అంగనవాడి కేంద్రంలో కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగనవాడి కేంద్రం పరిధిలోని గర్భవతులకు సామూహిక శ్రీమంత కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎం.వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ మాట్లాడుతూ నిరుపేద ప్రాంతాల్లో ఎన్నో అభిరుచులు కలిగిన మహిళలకు వారి అభిరుచులకు అనుగుణంగా శక్తి ఉండి కొన్ని కార్యక్రమాలు చేయించుకోలేక మనసులో ఇబ్బందులు పడే మహిళలను గుర్తించి వారికి శ్రీమంత కార్యక్రమం హిందూ సాంప్రదాయానికి అనుగుణంగా చేసి వారిలో నూతన ఉత్తేజం కల్పించే నిమిత్తం ఈ శ్రీమంత కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు.తద్వారా వారు ఒక లక్ష్యంతో మంచిగా కాన్పులు జరిగి ఈ సమాజానికి మంచి మానవత్వంతో గలిగిన విలువ కలిగిన బిడ్డలను అందిస్తారన్న సంకల్పంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని లీలామోహన్ కృష్ణ అన్నరు. అనంతరం అంగన్వాడీ కేంద్రం పరిధిలోని ముగ్గురు గర్భవతులకు సారా చీర గాజులు పసుపు కుంకుమ పండ్లు ఇతర సామాగ్రితో హిందూ సాంప్రదాయం అనుసరించి ముత్తైదువుల చేతుల మీదుగా శ్రీమంత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.వీటికి మెట్టు దళితవాడ మహిళలు నీరాజనాలు పలికారు

ఈ కార్యక్రమంలో ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త విజయలక్ష్మి గ్రామ మహిళలు గర్భవతులు చిన్నారులు పాల్గొన్నారు

# పాఠాలు చెప్పాల్సిన గురువులే

### విద్యార్థులకు పారలు పట్టించినపని చేపించడం ఎంతవరకు సమంజసం..!

### రాయలపేట ప్రభుత్వ పాఠశాలలో ఘటనపై విమర్శలు.

**పెద్దపంజాణి, జూన్ 18 (ప్రజాప్రతిభ):**

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులే చిన్నారుల చేత పార పనులు చేయించడం వివాదానికి దారితీసింది. పెద్దపంజాణి మండలంలోని రాయలపేట కె.వి.సి.ఆర్.జెడ్.పి.హెచ్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పారలు పట్టుకుని పనులు చేస్తున్న దృశ్యాలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.

పాఠశాల ఆవరణ అభివృద్ధి లేదా శుభ్రత కార్యక్రమాల పేరుతో విద్యార్థుల చేత మట్టి తవ్వించడం, పార పనులు చేయించడం సరైన పద్ధతి కాదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వరకు సమంజసమే కానీ, శారీరక శ్రమతో కూడిన పనులు చేయించడం నిబంధనలకు విరుద్ధమని పలువురు పేర్కొంటున్నారు.చిన్నారుల భద్రతకు ముప్పు కలిగించే పనుల్లో వారిని పాల్గొనించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. చదువుకోవాల్సిన సమయంలో ఇలాంటి పనుల్లో నిమగ్నం చేయడం వల్ల విద్యపై ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు అంటున్నారు.ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హక్కులు, భద్రతకు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.అయితే, ఈ ఆరోపణలపై



పాఠశాల యాజమాన్యం స్పందన తెలియాల్సి ఉంది. అధికారులు విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## జూన్ 20న చిత్తూరులో బీసీ కమిషన్ ప్రజా వినతుల స్వీకరణ.

**పెద్దపంజాణి, జూన్ 18 (ప్రజాప్రతిభ):**

బీసీ కమిషన్ ప్రతినిధులు జూన్ 20వ తేదీ ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు చిత్తూరు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ మెయిన్ హాల్‌లో ప్రజల నుండి వినతులు, దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎంపీడీవో బాలాజీ తెలిపారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ సమస్యలు లేదా అభ్యర్థనలు ఉన్న ప్రజలు తమ దరఖాస్తులు, అర్జీలను నేరుగా బీసీ కమిషన్ అధికారులకు అందజేసేందుకు ఇది మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అదేవిధంగా ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ అభివృద్ధి అధికారులు, స్వర్ణ గ్రామ సిబ్బందికి ఎంపీడీవో బాలాజీ సూచించారు. బీసీ వర్గాల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై తమ వినతులు సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎన్టీఆర్ కాలనీలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ

## విద్యాభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి అభినందనీయం

**కుప్పం, జూన్ 18, (ప్రజా ప్రతిభ):**


కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో గల ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. 11వ క్లస్టర్ ఇంచార్జి కన్నన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెస్త కుల కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, యూనిట్ ఇంచార్జి సుబ్రమణి, స్థానిక కౌన్సిలర్ అభ్యర్థి రవి తదితరులు పాల్గొని విద్యార్థులకు యూనిఫాంలను, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా యూనిఫాంలు, పుస్తకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వారు కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం వంటి అంశాల్లో ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని నాయకులు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, క్లస్టర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**కుప్పం, జూన్ 18, (ప్రజా ప్రతిభ):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కె.జి. వెంకట పద్మలత కుప్పం పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఆమెకు స్థానిక ఆర్‌డబీ అతిథి గృహంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి.ఎస్. మునిరత్నం, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ) అధ్యక్షులు జి.ఎం. రాజులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో కుప్పం నియోజకవర్గంలోని విద్యా రంగం, బాలల సంక్షేమం, బాలల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు నాయకులు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల విద్యాభివృద్ధి,విద్యార్థుల భద్రత, పోషకాహార కార్యక్రమాల అమలు వంటి అంశాలపై చర్చ జరిగినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మునిరత్నం, రాజులు వివరించారు. పిల్లల విద్య, ఆరోగ్యం, భద్రత, మానసిక వికాసం వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.బాలల సమగ్ర అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ శాఖలు,విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని కూడా సమావేశంలో ప్రస్తావించినట్లు వెల్లడించారు. కుప్పం నియోజకవర్గంలో బాలల సంక్షేమానికి సంబంధించిన పలు కార్యక్రమాల అమలు పరిస్థితులపై కమిషన్ సభ్యురాలు పద్మలత ఆరా తీసినట్లు సమాచారం. పిల్లలకు మెరుగైన అవకాశాలు కల్పించి వారి



భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని ఆమె సూచించినట్లు తెలిసింది. బాలల హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి అంశాల్లో ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

# హోంమంత్రి అనిత పై వ్యాఖ్యలు..

## అమర్నాథ్ క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్.

## మంత్రి అనిత పై అమర్నాథ్ వ్యాఖ్యలను ఖండించిన కుప్పం తెలుగు మహిళలు.

**కుప్పం, జూన్ 18, (ప్రజా ప్రతిభ):**

రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితను ఉద్దేశించి వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై కుప్పం తెలుగు మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు చంద్రకళ ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బెస్తకుల కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, రెస్కో డైరెక్టర్ అనసూయతో పాటు పలువురు తెలుగు మహిళ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర హోంశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అనితను ఉద్దేశించి "మేకప్ మహిళ" అంటూ వ్యాఖ్యానించడం మహిళా లోకాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. మహిళలు అలంకరణ చేసుకోవడం సహజమైన విషయమని, దానిని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం తగదన్నారు. "మీ కుటుంబంలో ఆడవారు లేరా? వారు మేకప్ వేసుకోరా?" అంటూ అమర్నాథ్‌ను ప్రశ్నించారు. మహిళల వ్యక్తిగత విషయాలను రాజకీయాల్లోకి తీసుకురావడం ఆయన స్థాయికి తగదని విమర్శించారు. అనిత ప్రజా జీవితంలో కష్టపడి ఎదిగిన నాయకురాలని, ఆమెపై వ్యక్తిగత విమర్శలు చేయడం



సరికాదన్నారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన గుడివాడ అమర్నాథ్ వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను తెలుగు మహిళలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని హెచ్చరించారు. సమావేశంలో పలువురు తెలుగు మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిల్లలకు విద్యా ఉపయోగకర వస్తువులు పంపిణీ

## పది లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి లాప్టాప్ పంపిణీ

**చౌడేపల్లి జూన్ 18(ప్రజా ప్రతిభ)**

మండలంలోని పంచాయతీ కేంద్రం వెంగళపల్లి  పాఠశాలకు చెందిన పిల్లలకు విద్య ఉపయోగ వస్తువులు పంపిణీ చేశారు గ్రామానికి చెందిన నరసింహులు అతని కుమారుడు కుమారస్వామిల ఆధ్వర్యంలో ఎంఈఓ కేశవరెడ్డి పిల్లలకు నోటు పుస్తకాలు పెన్నులు పలు విద్యా ఉపయోగకర వస్తువులను పంపిణీ చేశారు అదేవిధంగా ఇటీవల జరిగిన 10 ఫలితాలలో 578 మార్కులు సాధించిన వెంగళపల్లికి చెందిన జోష్నకు 60 వేలు విలువచేయు ల్యాప్టాప్ ను బహుకరించారు కష్ట పడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా వక్తలు అన్నారు ఇదే పాఠశాలలో 23 సంవత్సరములు పనిచేసి అందరిలోనూ మంచి పేరు తెచ్చుకున్న ఉపాధ్యాయుడు నాగరాజును ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్ష్మీ నరసయ్య నరసింహులు ఓబులేసు నాగేంద్ర శ్రీనివాసులు ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు



# కేజీబీవీ పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం

**శాంతిపురం,జూన్ 18 (ప్రజా ప్రతిభ):**

మండల పరిధిలోని కడపల్లి వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాలను గురువారం బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్‌పర్సన్ కె.జి.వెంకట పద్మలత  సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బాలల హక్కులు,బాలికల విద్య ప్రాముఖ్యత,రక్షణ,భద్రత సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.విద్యార్థిలను తమ సమస్యలు,సందేహాలను నిర్భయంగా వ్యక్తపరచాలని,విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు.పాఠశాలలో అందిస్తున్న విద్యా సౌకర్యాలు,వసతి,భోజనం ఇతర మౌలిక సదుపాయాలపై విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సెల్వ పాండియన్,చంద్రమ్మ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.బాలికల సమగ్ర అభివృద్ధి,భద్రత వారి హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# ఆధ్యాత్మికం. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులకు ఆహ్వానం.





**వాకాడు జూన్ 18 ప్రజా ప్రతిభ**

తిరుపతి జిల్లా వాకాడు: మండల పరిధిలోని కల్లూరు కొత్తపాలెం గ్రామంలో నూతనంగా 40 రోజుల క్రితం వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రతిష్టించి రేపటికి అనగా, శనివారం నాటికి 41 వ రోజు అవుతున్నదృష్ట్యా ఆలయములో మండలాభిషేకం, ఆలయ అనువంశిక ధర్మకర్త ,టిడిపి నాయకుడు దువ్వూరు జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఈ ఆలయంలో రేపు వివిధ రకాల హోమాలు, శ్రీ వెంకటేశ్వర స్వామి చందనాలంకారములో  భక్తులకు శ్రీ స్వామి దర్శనం ఇవ్వనున్నారు. విశేష పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. పూజలు అనంతరం జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. ఈ విశేష పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్న ప్రసాదాన్ని స్వీకరించవలసిందిగా ఆయన భక్తి పూర్వకంగా ఆహ్వానిస్తున్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి - నలుగురు అరెస్ట్



**శాంతిపురం,జూన్ 18(ప్రజా ప్రతిభ):**

శాంతిపురం మండలం,కెనమాకులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సిద్దావూరు గ్రామ సమీపంలోని మునేశ్వరస్వామి ఆలయానికి చెందిన కర్పూరం తోటలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించి నిఘా నిర్వహించారు.డ్రోన్ ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఐ.నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం ఆకస్మిక దాడి నిర్వహించింది.ఈ సందర్భంగా పబ్లిక్ ప్రదేశంలో "లోపల – బయట (మంగతాయి)"అను జూదం ఆడుతూ నగదు పై పందేలు కాస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.శాంతిపురం మండలానికి చెందిన జి.శ్రీనివాసులు,ఆర్.గజేంద్ర,కె.గణేష్, జి.కోటేశ్వరుడు నిందితుల వద్ద నుండి పందెం సొమ్ము రూ.6,500 మరియు 52 పేక ముక్కలనుస్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్‌లో సి ఆర్ నంబరు.72/2026,యు/సెక్షన్.9(1) ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడమైనది.
ఈ సందర్భంగా రాళ్ళబూదుగూరు ఎస్సై ఐ.నరేష్ మాట్లాడుతూ ప్రజలు జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని,అటువంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# చిన్నేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత (ఉర్దూ) పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో బాలాజీ.

**పెద్దపంజాణి, జూన్ 18 (ప్రజాప్రతిభ):**

మండలంలోని చలమంగళం పంచాయతీ పరిధిలోని చిన్నేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత (ఉర్దూ) పాఠశాలను గురువారం ఎంపీడీవో బాలాజీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ తీరును తనిఖీ చేశారు.అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడి అందుతున్న భోజనం నాణ్యత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, తరగతి గదులు తదితర మౌలిక వసతులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల హాజరు వివరాలను పరిశీలించిన ఎంపీడీవోకు, మొత్తం 144 మంది విద్యార్థులకు గాను 117 మంది హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో సూచించారు.పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు తరచూ పర్యవేక్షణ చేపట్టడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.






## వెంకీ-కళ్యాణ్ రామ్ మల్టీస్టారర్‌కు ఘన శ్రీకారం

- వెంకటేశ్, కల్యాణ్ రామ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో కొత్త సినిమా
- వెంకీ సరసన కీర్తి సురేశ్, కల్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి
- షైన్ స్క్రీన్స్, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్త నిర్మాణం

**టాకీస్:** టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తి రేపుతున్న భారీ మల్టీస్టారర్ చిత్రానికి ఈరోజు అధికారికంగా అంకురార్పణ జరిగింది. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా పూజా కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్రరావు, నిర్మాత అల్లు అరవింద్ వంటి సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ సినిమాలో కథానాయికల వివరాలను కూడా చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. వెంకీ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి నటించనుంది. దగ్గుబాటి, నందమూరి హీరోల కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్ర నిర్మాణంలో సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంస్థలు భాగస్వామ్యం వహిస్తున్నాయి. జాతీయ అవార్డు విజేత జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.



## బ్లాక్ అవుట్‌ఫిట్‌లో స్టైలిష్ కమ్‌బ్యాక్ ఇచ్చిన 'మోనాల్ గజ్జర్'

**- పవర్‌ఫుల్ క్యాప్షన్‌తో సోషల్ మీడియాలో వైరల్.. గ్లామర్ లుక్‌కు ఫ్యాన్స్ ఫిదా**

**టాకీస్:** గుజరాతీ భామ, ప్రముఖ నటి మోనాల్ గజ్జర్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాను ఆకర్షిస్తోంది. అల్లరి నరేష్ నటించిన 'సుడిగాడు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ అందాల భామ, అనంతరం 'బిగ్ బాస్' తెలుగు సీజన్-4 ద్వారా విశేష ఆదరణ పొందింది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొత్త ఫొటోషూట్ చిత్రాలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**ఆల్-బ్లాక్ అవుట్‌ఫిట్‌లో అదిరిపోయిన లుక్**

తాజా ఫొటోషూట్‌లో మోనాల్ గజ్జర్ పూర్తిగా బ్లాక్ థీమ్‌లో రూపొందించిన మోడరన్ కో-ఆర్డ్ సెట్‌లో మెరిసిపోయింది. డీప్ ప్లంజింగ్ వీ-నెక్ డిజైన్, నడుము భాగంలో కటౌట్ స్టైల్, రఫుల్డ్ పెప్లమ్ హెమ్‌తో కూడిన స్లీవ్‌లెస్ టాప్ ఆమెకు ప్రత్యేకమైన స్టైలిష్ లుక్‌ను అందించింది. దీనికి జతగా హై-వైస్టెడ్ వైడ్-లెగ్ ట్రౌజర్స్ ధరించి ట్రెండీ ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇచ్చింది.

**మినిమల్ యాక్సెసరీస్‌తో రాయల్ టచ్**

అవుట్‌ఫిట్‌కు తగ్గట్టుగా మోనాల్ మినిమల్ యాక్సెసరీస్‌ను ఎంపిక చేసుకుంది. చేతికి మెటాలిక్ వాచ్, స్టైలిష్ బ్రాస్లెట్, వేలికి కాక్టెయిల్ రింగ్ ధరించి తన లుక్‌ను మరింత ఎలిగెంట్‌గా మలిచింది. సహజమైన చిరునవ్వు, ఆకర్షణీయమైన హావభావాలు, స్టైలిష్ పోజులు ఫొటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**"గ్లో-అప్ కాదు.. కమ్‌బ్యాక్ నా లక్ష్యం"**

ఈ ఫొటోలకు మోనాల్ జత చేసిన క్యాప్షన్ ప్రస్తుతం నెటిజన్లను ఆకట్టుకుంటోంది.

"గ్లో-అప్ అంటే అందంగా మారడం నా గోల్ కాదు.. కమ్‌బ్యాక్ ఇవ్వడమే నా అసలు లక్ష్యం" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

**కొత్త ప్రాజెక్ట్‌లకు సంకేతమా..?**

మోనాల్ చేసిన ఈ పోస్ట్ చూసిన అభిమానులు, ఆమె త్వరలోనే కొత్త సినిమాలు లేదా వెబ్ సిరీస్‌లతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారేమోనని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు, క్యాప్షన్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

గ్లామర్, కాన్ఫిడెన్స్, కమ్‌బ్యాక్ స్పిరిట్ కలిస్తే అది మోనాల్ గజ్జర్ స్టైల్ అని అభిమానులు కామెంట్ చేస్తున్నారు.



## లాభాల్లో ముగిసిన సూచీలు...

### పీఎస్‌యూ బ్యాంకులు, హెల్త్‌కేర్ షేర్ల జోరు

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్లు ఊపందుకోవడంతో కీలక సూచీలు నష్టాల నుంచి కోలుకున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌యూ), హెల్త్‌కేర్, రియల్టీ షేర్లకు బలమైన కొనుగోళ్ల మద్దతు లభించింది. అయితే, ఐటీ రంగంలో చోటుచేసుకున్న అమ్మకాల ఒత్తిడి మార్కెట్ లాభాలను కొంతమేర పరిమితం చేసింది.

- 254 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 82 పాయింట్ల లాభంతో నిఫ్టీ
- ఐటీ రంగం షేర్లలో అమ్మకాల ఒత్తిడి, సూచీ 1.19 శాతం నష్టం
- లాభాల్లోనే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు
- డాలర్‌తో పోలిస్తే 16 పైసలు బలపడిన రూపాయి

ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 254.36 పాయింట్లు (0.33 శాతం) పెరిగి 77,409.98 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 82.30 పాయింట్లు (0.34 శాతం) లాభపడి 24,168.00 వద్ద ముగిసింది.

రంగాల వారీగా పరిశీలిస్తే, నిఫ్టీ హెల్త్‌కేర్ ఇండెక్స్ దాదాపు ఒక శాతం మేర పుంజుకోగా, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ రియల్టీ సూచీలు కూడా గణనీయమైన లాభాలను నమోదు చేశాయి. దీనికి విరుద్ధంగా, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.19 శాతం నష్టపోయి అత్యంత బలహీనంగా నిలిచింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ వంటి కీలక షేర్లు సూచీల లాభాలకు బాసటగా నిలిచాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ సానుకూల ధోరణి కనిపించగా, నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం లాభాల్లో ముగిశాయి.

సాంకేతికంగా నిఫ్టీకి 24,200 స్థాయి వద్ద తక్షణ నిరోధం ఉందని, దానిని అధిగమిస్తే 24,400 వరకు వెళ్లే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దిగువన 24,000 స్థాయి కీలక మద్దతుగా పనిచేస్తుందని, ఒకవేళ ఆ స్థాయిని కోల్పోతే లాభాల స్వీకరణ చోటుచేసుకోవచ్చని భావిస్తున్నారు.

మరోవైపు, డాలర్‌తో రూపాయి మారకం విలువ వరుసగా ఐదో రోజు బలపడి 94.32 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 16 పైసలు మెరుగుపడింది.

## బీసీసీఐ కీలక నిర్ణయం.. ఐపీఎల్ 2027 షెడ్యూల్‌లో మార్పు!

**స్పోర్ట్స్ డెస్క్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అభిమానులకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక అప్‌డేట్ అందించింది. 2027లో జరగబోయే 20వ ఐపీఎల్ ఎడిషన్ షెడ్యూల్‌లో బీసీసీఐ భారీ మార్పులు చేయనుంది. సాధారణంగా మార్చి చివరి వారంలో ప్రారంభమై, మే ఆఖరి వరకు సాగే ఈ టోర్నీని వచ్చే ఏడాది రెండు వారాల ముందే ప్రారంభించనున్నారు.



ఐపీఎల్ 2027 సీజన్‌ను మార్చి 10 నుంచి మే 15 వరకు నిర్వహించేలా కొత్త విండోను ఖరారు చేసినట్లు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా గురువారం వెల్లడించారు. మే నెల చివరి వారాల్లో దేశంలో నమోదవుతున్న విపరీతమైన ఎండల తీవ్రత, కొన్ని ప్రాంతాల్లో ముందస్తు రుతుపవనాల ప్రభావం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఐపీఎల్ 2026 సీజన్ మే 31 వరకు కొనసాగడం వల్ల ఆటగాళ్లు, మైదానానికి వచ్చే అభిమానులు తీవ్రమైన ఉక్కపోత, ఎండలతో ఇబ్బంది పడ్డారని వెల్లడించారు.

ప్రేక్షకుల సౌకర్యార్థమే టోర్నీని రెండు వారాలు ముందుకు జరుపుతున్నామని తెలిపారు. ఇదే సమయంలో ఐపీఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్య పెరగవచ్చనే ఊహాగానాలకు సైకియా తెరదించారు. అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్, ఇతర దేశాల ద్వైపాక్షిక సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచే ప్రతిపాదనను ప్రస్తుతానికి పక్కనబెట్టామన్నారు. వచ్చే సీజన్‌లో కూడా పాత పద్ధతిలోనే 74 మ్యాచ్‌లు జరుగుతాయని స్పష్టం చేశారు.

## వైభవ్, తిలక్ వర్మపై బీసీసీఐ వేటు..

### మ్యాచ్ ఫీజుల్లో భారీ కోత!




భారత్-ఏ జట్టు తరఫున ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఆడుతున్న యువ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మలపై బీసీసీఐ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. మైదానంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు ఇద్దరి మ్యాచ్ ఫీజుల్లో కోత విధిస్తూ జరిమానాలు విధించింది. యువ ఆటగాళ్లు తమ ప్రవర్తనలో మరింత బాధ్యత చూపాల్సిన అవసరం ఉందని బీసీసీఐ స్పష్టం చేసింది.

శ్రీలంక-ఏతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ వివాదంలో చిక్కుకున్నాడు. మ్యాచ్ సందర్భంగా శ్రీలంక ఆటగాడు వీసెన్ హల్లంబాగే చేసిన వ్యాఖ్యలు, ఎగతాళికి స్పందించిన వైభవ్ సహనం కోల్పోయి అతని వైపు దూసుకెళ్లి చేతితో నెట్టిన ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటన మైదానంలో ఉద్రిక్తతకు దారితీయడంతో పాటు సోషల్ మీడియాలో కూడా పెద్ద చర్చకు కారణమైంది. యువ ఆటగాడి ప్రవర్తనపై అభిమానులు, మాజీ క్రికెటర్లు విమర్శలు వ్యక్తం చేశారు.

ఈ ఘటనపై మ్యాచ్ రిఫరీ ప్రదీప్ జయప్రకాష్ నివేదిక సమర్పించగా, దానిని పరిశీలించిన బీసీసీఐ వైభవ్ సూర్యవంశీ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించింది. అదే ఘటనలో పాల్గొన్న శ్రీలంక ఆటగాడు హల్లంబాగేకు కూడా శ్రీలంక క్రికెట్ బోర్డు 50 శాతం మ్యాచ్ ఫీజు జరిమానా విధించింది. గొడవను ఆపేందుకు జోక్యం చేసుకున్న శ్రీలంక సీనియర్ ఆటగాడు నిరోషన్ డిక్వెల్లాపై కూడా 20 శాతం ఫీజు కోత విధించడం గమనార్హం.

మరోవైపు భారత్-ఏ జట్టు కెప్టెన్ తిలక్ వర్మ కూడా క్రమశిక్షణా ఉల్లంఘన ఆరోపణలు ఎదుర్కొన్నాడు. మ్యాచ్ సమయంలో సూపర్ ఓవర్ నిర్వహణ, నోబాల్ నిర్ణయాలు, వెలుతురు పరిస్థితులకు సంబంధించిన అంశాలపై తిలక్ పలుమార్లు అంపైర్లతో వాగ్వాదానికి దిగినట్లు రిపోర్టుల్లో పేర్కొన్నారు. మ్యాచ్ అధికారులతో అనుచితంగా ప్రవర్తించడం నిబంధనలకు విరుద్ధమని భావించిన మ్యాచ్ రిఫరీ, తిలక్‌పై చర్యలు తీసుకోవాలని సూచించాడు.

దీంతో బీసీసీఐ తిలక్ వర్మ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించింది. కెప్టెన్‌గా మైదానంలో మరింత సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని బీసీసీఐ భావించినట్లు తెలుస్తోంది. యువ ఆటగాళ్లకు ఆదర్శంగా ఉండాల్సిన బాధ్యత కెప్టెన్లపై మరింత ఎక్కువగా ఉంటుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

సాధారణంగా భారత్-ఏ, శ్రీలంక-ఏ వంటి జట్ల మధ్య జరిగే



మ్యాచ్‌లు నేరుగా ఐసీసీ పరిధిలో ఉండవు. అందువల్ల క్రమశిక్షణా ఉల్లంఘనలకు సంబంధించిన చర్యలను ఆయా దేశాల క్రికెట్ బోర్డులే తీసుకుంటాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ విడుదల చేసిన ప్రకటనలో, భారత్-ఏ జట్టు ప్రస్తుతం కీలకమైన ట్రై సిరీస్ ఆడుతోందని, సీనియర్ జట్టులో స్థానం కోసం పోటీ పడుతున్న యువ ఆటగాళ్లు వివాదాలకు దూరంగా ఉండి తమ ఆటపై మాత్రమే దృష్టి సారించాలని సూచించింది. ప్రతిభతో పాటు క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యమని ఈ చర్యల ద్వారా బోర్డు స్పష్టమైన సందేశం ఇచ్చింది.

Printed published and own by him Dr. kongarapu Ganapathi, D.No 1/164 Balanki street, paalakonda-532440.
Officeaddress D-NO: 8-33-13, Near Kalabarathi opp com office, pithapuram colony, Maddilapalem visakhapatnam-530003. RNI:APTEL 2013/54721.
Editor in Chief: Danuri Srinivas - 9441500341